RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

15 డిసెంబర్ 2024 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:168






జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి త్వరలో పెళ్లి చేసుకోబోతున్న ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు గారు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారిని కలిసి ఆహ్వానపత్రిక అందించారు. సింధు గారు కుటుంబ సభ్యులతో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి గారిని కలిసి వివాహానికి ఆహ్వానించారు.

# దొడ్డి కొమురయ్యభవన ప్రాంగణంఒకవిద్యా వేదిక కావాలి

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి







రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన 98 శాతం మేరకు పూర్తయిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. మిగిలిన రెండు శాతం పూర్తయితే దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ కులగణన తెలంగాణ ప్రజల మెఘా హెల్త్ ప్రొఫైల్‌గా మారుతుందని అన్నారు.

హైదరాబాద్‌లో నిర్మించిన కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ – దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య పోరాటాలను స్మరించుకున్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య గారని అన్నారు.

చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టినట్టుగానే, దొడ్డి కొమురయ్య గారిని శాశ్వతంగా గుర్తుండిపోయేలా మంత్రివర్గ సహచరులతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు.

దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణం ఒక విద్యా వేదిక కావాలి. విజ్ఞానం పంచాలి. కురుమ సోదరులకు విద్య కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రుణమాఫీ, వరికి బోనస్, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, పేదలకు వైద్య సౌకర్యాలు అందించడం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కువగా బలహీన వర్గాలకు అందాయని చెప్పారు.

తెలంగాణకు జమిందారుల తల్లి కాదు. బహుజనుల తెలంగాణ తల్లి ఉండాలి. ఏ తల్లి అయితే మన అమ్మ లాగా ఉంటుందో, అడక్కుండానే మన ఆకలిని గుర్తించి బుక్కెడు అన్నం పెడుతుందో అలాంటి తెలంగాణ తల్లిని తెచ్చుకున్నాం.

మన అమ్మకు ప్రతిరూపం. మన అక్కకు ప్రతిరూపం. ఒకపక్క వరి, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న వంటి తెలంగాణలో పండించే పంటతో పాటు నా బిడ్డలు చల్లంగా ఉండాలి. నా బిడ్డలు శాశ్వతంగా అభివృద్ధి పథంవైపు నడవాలని ఆశీర్వదించే తెలంగాణ తల్లిని మనం ప్రతిష్టించుకున్నామని అన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ , హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం , ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రి హెచ్ ఎం రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కామన్ డైట్‌ను ప్రారంభించిన రేవంత్‌రెడ్డి





చేవెళ్ల నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి తెలంగాణ వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులందరికీ ఒక విధమైన ఆహారం అందించాలన్న సంకల్పంలో చేపట్టిన కామన్ డైట్ మెనూ నేటి నుంచి ప్రారంభమైంది. చేవెళ్ల నియోజకవర్గం చిలుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కామన్ డైట్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా కామన్ మెనూ డైట్ కార్యక్రమం జరగ్గా, చిలుకూరులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి అక్కడ పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ స్కూల్ నుంచి ప్రతిభ కనబరిచి ఐఐటీ లాంటి ఉన్నత విద్యా సంస్థల్లో చేరిన పలువురు విద్యార్థులకు ల్యాప్ టాప్ లు బహూకరించారు. అనంతరం పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. భోజనం చేస్తున్న సందర్భంగా విద్యార్థుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# చదువుతో పాటు క్రీడలకు ప్రాదాన్యతనివ్వాలి –

## కార్పొరేటర్ బోయినీ దర్శన్





కార్వాన్ ప్రజాబలం ప్రతినిధి : నెహ్రూ యువ కేంద్ర హైదరాబాద్ డిస్ట్రిక్ట్, పర్యావరణ పరిరక్షణ సేవా సమితి ఆధ్వరంలో బ్లాక్ లెవెల్ క్రీడలు నిర్వహించారు. ఈ నెల పదో తారీకు నుండి 13వ తారీకు వరకు నిర్వహించిన ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, కరాటే మల్కం వంటి క్రీడలను నిర్వహించారు. భారత అభ్యుదయ హైస్కూల్లో కబడ్డీ, కరాటే పోటీలు, జియాగూడ మున్సిపల్ గ్రౌండ్లో కొక్కో వాలీబాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ ఎంకే శ్రీ బాలాజీ, మల్కం కోచ్ పాల్ సింగ్, కబడ్డీ కోచ్ జి నరేష్, వాలీబాల్ కోచ్ ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల పట్టణ ప్రజల సౌకర్యార్థం వైకుంఠధామం ఏర్పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 14 : మంచిర్యాల పట్టణ ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ పరిధిలో వైకుంఠధామం ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం మంచిర్యాల పట్టణంలోని ఎం కన్వెన్షన్ హాల్ లో వైకుంఠధామం ఏర్పాటుపై నిర్వహించిన కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మంచిర్యాల పట్టణ ప్రజల సౌకర్యం కోసం మున్సిపల్ పరిధిలోని గోదావరి నది తీరంలో వైకుంఠధామం ఏర్పాటు కొరకు 4 ఎకరాల భూమిని గుర్తించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వైకుంఠధామం నిర్మాణం కొరకు 4 కోట్ల 42 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని,తదుపరి అవసరం మేరకు నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ప్రజల సౌకర్యం కోసం అధునాతన ఏర్పాట్లతో వైకుంఠధామం నిర్మించడం జరుగుతుందని,నీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం వైకుంఠధామం నమూనాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

15 డిసెంబర్ 2024 ఆదివారం

# విజయ్ దివస్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం!

1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో భారత త్రివిధ దళాలు గెలుపొందిన శుభ దినంగా 16 డిసెంబర్ రోజున దేశవ్యాప్తంగా "విజయ్ దివస్" వేడుకలను సగర్వంగా, ఘనంగా నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా వస్తున్నది. బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్ విముక్తి పోరాటంగా 03 డిసెంబర్ 1971న ప్రారంభమైన ఇండియా-పాకిస్థాన్ యుద్ధం13 రోజుల పాటు కొనసాగిన పిదప 16 డిసెంబర్ 1971 రోజున పాకిస్థాన్ ఓటమిని అంగీకరించడంతో బంగ్లాదేశ్ ఒక స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడం, ఇండియా త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ లొంగి పోవడం, భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌లో విజయోత్సవాలు నిర్వహించడం జరిగింది. నాటి నుండి ప్రతి ఏట మన త్రివిధ దళాల పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ నాటి యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులు అర్పించడం, గాయపడిన సైనికులకు కృతజ్ఞతలు తెలియజేయడా సాంప్రదాయంగా వస్తున్నది. 1947లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత జరిగిన తీవ్ర పరిణామాల్లో దేశం భారత్, పాకిస్థాన్ అనబడే రెండు ముక్కలుగా విభజించబడడం, విభజన తీవ్ర రక్తపు మరకలతో జరగడం చూసాం. విభజన తర్వాత నూతనంగా ఏర్పడిన పాకిస్థాన్‌లో ఈస్ట్ పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్), వెస్ట్ పాకిస్థాన్ (నేటి పాకిస్థాన్) అన రెండు ప్రాంతాలు చేరడం జరిగింది. వెస్ట్ పాకిస్థాన్ అణచివేత చర్యలతో ఈస్ట్ పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ నలిగి పోవడం, రెండు ప్రాంతాల ప్రజల మధ్య తీవ్రమైన విభేదాలు పొడచూపడంతో రెండు ప్రాంతాల మధ్య తీవ్ర ఘర్షణలు కొనసాగడం జరిగింది. నాటి పాకిస్థానీ జనరల్ యేహ్యా ఖాన్ దుందుడుకు చర్యలు, బంగ్లాదేశీయులను అణిచివేత, మహిళల మానభంగాలు, అమానవీయ మారణహోమంతో రెండు పాకిస్థానీ ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం పొడచూపడంతో బంగ్లాదేశ్ స్వతంత్రం కోసం యుద్ధం అనివార్యం అయ్యింది. ఈ పోరాటంలో బంగ్లాదేశ్ "ముక్తి బహిణి" దళాల భాగస్వామ్యం కూడా ప్రధానమైనదిగా పేర్కొనబడింది. బంగ్లాదేశ్ ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వెస్ట్ పాకిస్థాన్ ప్రభుత్వం పని చేయడంతో "బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్"లో తమ స్వతంత్రం కోసం "బంగ్లా విముక్తి" పోరాటాలు ఎగిసిపడడం, దానికి నాటి ఇందిరాగాంధీ నేతృత్వపు భారత ప్రభుత్వం కూడా సహకరించడం గమనించాం. 03 డిసెంబర్ 1971 రోజున భారత్‌పై పాకిస్థానీ ఏయిర్ ఫోర్స్ దాడులు జరపడంతో ఇండియా, పాకిస్థాన్‌లో మధ్య యుద్ధం ప్రారంభం అయ్యింది. దీనికి బదులుగా భారత త్రివిధ దళాలు, ముఖ్యంగా భారత నావికా దళం 04 డిసెంబర్ 1971న నిర్వహించిన "ఆపరేషన్ ట్రిడెంట్" జవాబుతో కరాచీ పోర్ట్ నామరూపాలు లేకుండా పోవడంతో పాకిస్థాన్ బిత్తరపోవడం, భారత్ తన ప్రతాపాన్ని పాక్‌కు రుచి చూపడం గత ఘన చరిత్రగా నిలిచిపోయింది. 14 డిసెంబర్ 1971 రోజున ఈస్ట్ పాకిస్థాన్ గవర్నర్ ఇంటిపై భారత ఏయిర్ ఫోర్స్ దాడులు చేయడంతో ఖంగుతిన్న పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి బంగ్లాదేశ్ ఏర్పడడానికి అంగీకరించడం, 16 డిసెంబర్‌న పాకిస్థానీ జనరల్ ఏ ఏ కె నాజియా నేతృత్వంలో 93,000 పాకిస్థానీ సైన్యం లొంగి పోవడంతో, పాకిస్థానీ కంబంధహస్తాల నుంచి బంగ్లాదేశ్ లేదా ఈస్ట్ పాకిస్థాన్ స్వేచ్ఛను పొందిన ఫలితంగా మరో కొత్త దేశంగా బంగ్లాదేశ్ ఆవిర్భవించడం జరిగిపోయింది. భారత జనరల్ సామ్ మనేక్‌షా నేతృత్వంలో సాధించిన విజయంలో పాటు 3,000 మంది వరకు భారత సైనికులు ప్రాణాలు కోల్పోవడం, 9,851 మంది వరకు గాయపడడం విచారకరం. పాకిస్థాన్ సైన్యంలో 8,000లకు పైగా మరణాలు, 25,000ల వరకు సైనికులు గాయపడడం జరిగింది. తొమ్మిది నెలలుగా జరిగిన ఈస్ట్, వెస్ట్ పాకిస్థాన్ పోరాటంలో పాకిస్థానీ అనుకూల, వ్యతిరేక దళాల మధ్య జరిగిన పోరులో 3 లక్షల నుంచి 3 మిలియన్ల వరకు సాధారణ ప్రజలు/సైనికులు మరణించడం, అనేక మంది మహిళలు మానభంగం చేయబడడం లాంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకోవడం వెస్ట్ పాకిస్థానీ ప్రభుత్వ పెద్దల ఫలితమే అని అర్థం చేసుకోవాలి. భారత త్రివిధ దళాలు అర్జించి పెట్టిన ఈ ఘన విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట 16 డిసెంబర్ రోజున "విజయ్ దివస్" నిర్వహించుకోవడం, ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళులు అర్పించడం, గాయపడిన సైనికులకు చేయూతను అందించడం జరుగుతున్నది.

## గ్రూప్ - 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

## -పట్టణ సీఐ శశిధర్ రెడ్డి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 14** :నేడు రేపు జరగనున్న గ్రూప్-%××% పరీక్షల నేపథ్యంలో మందమర్రి, రామకృష్ణపూర్ లో ఏర్పాటు చేసిన సెంటర్ల వద్ద పోలీసుల బందోబస్తు తదితర విషయాలను చర్చించేందుకు శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో సీఐ శశిధర్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా హాల్ లోకి వచ్చే వారు సెల్ఫోన్ తీసుకొని రాకుండా చూడాలన్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే సెంటర్ లోకి అనుమతి ఇవ్వాలన్నారు. పరీక్ష సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టు దిట్టం చేయాలని ఆయన తెలిపారు. ఈసమావేశంలో మందమర్రి ఎస్ఐ శివనీతి రాజశేఖర్, అడిషనల్ ఎస్సై శీను, ఆర్ కె పి ఎస్ఐ రాజశేఖర్, తాళ్ల గురిజాల ఎస్ఐ రమేష్, నెన్నెల్ ఎస్ఐ ప్రసాద్, కన్నెపల్లి ఎస్సై గంగారం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బొగ్గు నాణ్యత పాటిస్తూ నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

## సింగరేణి సి.అండ్.ఎం.డి ఎన్. బలరాం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 14** :బొగ్గు నాణ్యత పాటిస్తూ రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా సాధించాలి అన్ని ఏరియాల జీఎం.లకు సీ ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశించారు. శనివారం ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మార్చి 31 వరకు ఇకపై రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తి, నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. లక్ష్యాల మేరకు ఉత్పత్తి సాధిస్తున్న గనులను, ఏరియాలను ఆయన అభినందిస్తూ, వెనుకబడి ఉన్న ఏరియాలు ఇప్పుడు పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లక్ష్యాల సాధనతో పాటు నాణ్యతకు, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాణ్యత తగ్గినట్లయితే వినియోగదారుల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏరియాలో పై అధికారుల నుంచి కిందిస్థాయి వరకు అందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు.

ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి ఇంకా 108 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, ఈ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదే మోతాదులో బొగ్గు రవాణా నిర్వహించాలన్నారు. బొగ్గు రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా, ఎప్పటికప్పుడు రైల్వే అధికారులతో సంప్రదిస్తూ వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందచేయాలని సూచించారు. విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా తగినంత బొగ్గును అందజేసే బాధ్యత మనపై ఉందని ఆయన తెలియజేశారు.

ఆయనతో పాటు సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, జి.వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవిప్రసాద్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

## బొడ్డు శ్రీధర్ మిత్ర బృందం బీ.ఆర్.ఎస్ లో చేరిక







**గండీపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 14** డిసెంబర్ 2024 తెలంగాణ రాష్ట్ర సమితి యువ నాయకుడు పట్లొల్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో శనివారం రోజున శ్రీకృష్ణ ప్లాజా బాంక్వెట్ట్ హాల్ (దిలీప్ సూపర్ మార్కెట్ పైన) నందు జరిగిన మణికొండ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకర్తల సమావేశంలో దాదాపు 300 మంది పైన సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు తది తరులు కిక్కిరిసిన జనంతో బొడ్డు శ్రీధర్ ఆద్వర్యంలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి చేరడం జరిగినదని పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తెలియ చేసినారు, ఆయన మాట్లాడుతూ మణికొండ మునిసిపల్ పరిధిలోని భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు, అందు నిమిత్తం సదరు అధికారులను కలసి ప్రజల మేలుకోరి సమస్యల నివారణకు దిన దినము ముందుకు సాగుతు చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరిన బొడ్డు శ్రీధర్ మిత్ర బృందంలలో ముఖ్యులు కనుమూరు రాధిక, రావుల రాజశేఖర్ రెడ్డి, అమృత్ కుమార్, జగదీష్, నారాయణ రాజు, శ్రీకాంత్ బిక్కుమండ్ల, శ్రావణ్ కుమార్, ప్రణిత వెల్లంకి, రాజు, బాషా తదితరులు కలరు.

## ఆర్ టీ సీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ డిసెంబర్ 14 :** లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో జాతీయరహదారిపై ఆర్ టీ సీ బస్సు ఢీకొని ఇటిక్యాలకు చెందిన చుంచు లింగయ్య(62) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుడు తన టీ వీ ఎస్ ఎక్స్ ఎల్ వాహనం పై లక్షెట్టిపేట మార్కెట్ కు వెళ్తుండగా మంచిర్యాల నుండి లక్షెట్టిపేట వైపు వస్తున్న ఆర్ టీ సీ బస్సు వెనకనుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య చుంచు లక్ష్మీ పిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన బస్సును అదుపులోకి తీసుకొని బస్సు డ్రైవరు సంబోదు కొండయ్య పై కేసు నమోదు చేసిన లక్షెట్టిపేట ఎస్సై పి.సత్తిష్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్

విజయవాడ శనివారం నాడు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ మధుకర్ భగవత్ ఇంద్రకీలాద్రిలోని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సత్యనారాయణ, ఆలయ ఈవో కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.ఈ సందర్భంగా మోహన్ భగవత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత అయనకు వేదపండితుల తో వేదాశీర్వచనం కల్పించారు. మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆలయ ఈవో అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదములు మరియు చిత్రపటం అందజేశారు.తరువాత మంత్రి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆలయమునకు రావడంతో అయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితుల ఆశీర్వచనం కల్పించి, ప్రసాదములు అందజేసి గౌరవించామని అన్నారు. డిసెంబర్ 21 నుండి 25 వరకు జరుగు భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానం వారు దసరా లాగే పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం నుండి కావలసిన సహకారములు అందిస్తున్నాం. దీక్షా విరమణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ముందస్తు బుకింగ్స్, దీక్షా సమాచారం, కౌంటర్లు, పార్కింగ్, టాయిలెట్స్, మెడికల్, సమయం వివరాలు తదితర సమాచారంతో కూడిన మొబైల్ ఆప్ ను ఆవిష్కరించి లాంచ్ చేశారు. భక్తులందరూ ప్లే స్టోర్ నుండి భవాని దీక్ష 2024 అను ఆప్ ను డౌన్ లోడ్ చేసుకొని వినియోగించుకొనవలసిందిగా తెలిపారు.

# నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియలో విలీనం చేసిన ఘనుడు

సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరు వినగానే– దేశ స్వాతంత్ర్యం అనం తరం స్వదేశీ సంస్థానాల విలీనం అంశం ఎవరికైనా గురుకొస్తుంది. 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ నిజాం పైకి భారత సైన్యంతో దాడి చేయించి, రజాకార్లను పారద్రోలి, ఆ సంస్థానాన్ని ఇండియన్ యూనియ లో విలీనం చేసిన పటేల్ ఘనత అందరికీ స్ఫురణకు వస్తుంది. నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగించి, మీర్ ఉస్మాన్ ఆలీఖాన్‌ను లొంగ దీసుకున్న మహా సాహసి మన 'సర్దార్'. 'ఉక్కుమనిషి'గా దేశ ప్రజ లంతా కీర్తించిన ఆయనను సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నడియాలో పటేల్ జవేరి భాయ్, లాడ్ దంపతులకు నాలుగవ సంతానంగా జన్మించారు. భారతదేశంలో కలిసేందుకు విముఖంగా ఉన్న, విభేదిస్తున్న పలు రాష్ట్రాలను జాతీయవాది అయిన పటేల్ ఒప్పించి, ఏకం చేసి భారతదేశంలో ఐక్యం చేసిన నేపథ్యంలో ఆయన్ను భారత దేశ ఉక్కు మనిషి (ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా) అని కూడా పిలుస్తుంటారు. ఇంట్లో అన్నలు తనపై అధికారం చెలాయించిన క్రమంలో ఆయన తరుచూ ఎదురు తిరిగేవారు. ఆ మనస్తత్వ ప్రభావమే పెద్దయ్యాక ఆయనలో స్పష్టంగా కనిపించింది. బాల్యంలో ఆకతాయిగా తిరుగుతూ చదువుపై అంతగా ధ్యాస పెట్టని పటేల్ ఏళ్ల వయసులో మాత్రం ఆంగ్లభాషపై మమకారం పెంచుకున్నారు. నాలు గేళ్లు కష్టించి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాక, జిల్లా ప్లీడర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి న్యాయవాద వృత్తిని చేపట్టారు. లండన్ వెళ్లి 'బారిస్టర్' చదవనిదే తనకు గౌరవం దక్కదని భావించి, మూడేళ్ళు శ్రమించి తగిన ధనాన్ని సంపాదించారు. సోదరుడు విఠల్ భాయ్ పటేల్ కోరికపై తాను సంపాదించిన డబ్బుతో అతడిని బారిస్టర్ చదివించారు. అన్న తిరిగి వచ్చాక, మళ్లీ సంపాదించిన డబ్బుతో లండన్ వెళ్లి బారిస్టర్ పూర్తి చేశారు. తాను చదివిన విద్యా సంస్థలో ఉత్తమ విద్యార్థిగా 57 పౌనుల బహుమానాన్ని పొందారు. స్వదేశం వచ్చాక సూటు, బూటు, హ్యాటు ధరించి అహమ్మదాబాద్ లో గొప్ప క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. లో ఒకరోజు స్నేహితులతో కలిసి క్లబ్లో పేకాడుతున్న సమయంలో గాంధీజీ అక్కడికి వచ్చి, జాతీయ పాఠశాలను నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. అపుడు గాంధీజీ వైపు పటేల్ కన్నెత్తైనా చూడలేదు. అయితే, అదే ఏడాది గాంధీజీ అధ్యక్షత వహించిన గుజరాత్ కాంగ్రెస్ సభకు పటేల్ కార్యదర్శిత్వం వహించాల్సి వచ్చింది. అపుడు మహాత్ముని ప్రభావంతో పటేల్ జీవితం దేశానికి అంకితమైంది. 1918లో కైరా జిల్లాలో కరవు కారణంగా పన్ను మినహా యింపు ఇవ్వాలని రైతులు చేసిన విజ్ఞప్తిని బ్రిటిష్ ప్రభుత్వం పట్టించు కోలేదు. కైరా సత్యాగ్రహాన్ని పటేల్ విజయ వంతంగా పూర్తి చేయగా, తనకు సరైన అనుచరుడు, కార్యదీక్షా పరుడు లభించాడని గాంధీ ప్రశంసించారు. ఆ తర్వాత అహమ్మదాబాద్ మున్సిపల్ చైర్మన్ గా 1928లో బార్డోలీ సత్యాగ్రహ సారథిగా, 1931లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, 1932లో క్విట్ ఇండియా ఉద్యమంలో పటేల్ చురుకైన పాత్ర నిర్వహించారు. దేశ విభజన సమయంలో, భారత రాజ్యాంగ నిర్మాణంలో సంస్థానాల విలీనంలో పటేల్ నాయకత్వ పటిమ ఉపయోగపడింది. గాంధీజీ సహచరుడిగా, జైలులో ఆయనకు సంరక్షకునిగా వ్యవహరించిన పటేల్ వాస్తవ దృక్పథంతో ఆలోచిస్తూ, అరుదైన వ్యక్తిత్వంతో దేశానికి సేవలందించారు. ఒకసారి కోర్టులో వాదిస్తున్న సమయంలో ఆయనకు టెలిగ్రాం రాగా, దానిని చదువుకుని కొద్దిసేపు కళ్లు మూసుకొని, ఏమీ కానట్లు తన వాదనను కొనసాగిం చారు. ఆ తర్వాత అందరికీ తెలిసింది ...ఆయన భార్య మరణించినట్లు టెలిగ్రాంలో వర్తమానం ఉందని. దేశ విభజన వేళ– 'కుళ్లిన అవ యవాన్ని ఖండించి, మిగిలిన శరీరాన్ని కాపాడడమే మన కర్తవ్యం. దేశ విభజ నకు ఒప్పుకోకుంటే స్వాతంత్ర్యం వచ్చే అవకాశమే ఉండదు. మొత్తాన్ని కోల్పోవడం కంటే కొంత వదులుకోవడానికే నేను ఇష్టపడతాను' అని ఆయన చెప్పేవారు. బార్డోలి సత్యాగ్రహం సందర్భంగా... 'తక్కువ మాట్లాడండి, ఎక్కువ సాధించండి, విప్లవం.. అని కేకలు వేయకండి, అలా కేకలు వేసే నాయకులకు కొదవ లేదు. క్రమశిక్షణాశీలురైన అనుచరులు లేనిదే పోరాటం విజయవంతం కాదు. మంచి సైనికులుగా తయారుకండి' అని పటేల్ పిలుపు నిచ్చారు. కాగా, జాతీయోద్యమ సమయాన పటేల్ నెహ్రూతో విభేదించారు. 1938 నాటి కాంగ్రెస్ సదస్సులో నెహ్రూ ప్రవచించిన సోషలిజాన్ని పటేల్ వ్యతిరేకించారు. సంస్థానాల విలీనంలో నెహ్రూ శాంతి కాముకతను కాదని, సైనిక చర్యలు చేపట్టి సర్దార్ విజయం సాధించారు. పాకిస్తాన్ కు 55 కోట్ల రూపాయలు ఇవ్వరాదని నెహ్రూతో వాదించారు. తొలి రాష్ట్రపతి ఎన్నికలలో నెహ్రూ రాజగోపాలా చారిని సమర్ధించగా, పటేల్ రాజేంద్ర ప్రసాద్ ను ప్రతిపాదించి సఫలీకృతులైనారు. భారత రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షునిగా అంబేద్కర్‌ను నియమించడంలో పటేల్ కీలక పాత్ర పోషించారు. 1950లో కాంగ్రెస్ అధ్యక్షునిగా నెహ్రూ కృపలానీని సమర్థించగా, పటేల్ పురుషోత్తమ్ దాస్ టాండన్ ను గెలిపించారు. కేంద్ర హోం మంత్రిగా, ఉప ప్రధానిగా 1947 నుండి 1950 డిసెంబర్ 15న మరణించే వరకు పదవిలో ఉన్నారు. పటేల్ సేవలకు గుర్తింపుగా 1991లో 'భారతరత్న' పురస్కారం ప్రకటించింది. అఖండ భారతావని సమగ్రతకు సమైక్యతకు చిత్త శుద్ధితో కృషి సల్పిన సర్దార్ పటేల్ ఖ్యాతిని అంతర్జాతీయంగా చిరస్థాయిగా నిలపాలని నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారీ పటేల్ విగ్రహం ఏర్పాటుకు సంకల్పించి శ్రీకారంచుట్టారు. విగ్రహాన్ని గుజరాత్‌లో నర్మదానది మధ్యలో సర్దార్ సరోవర్ డ్యాంకు మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించేందుకు నిర్ణయించి నరేంద్రమోడీ శంకుస్థాపన చేశారు. ఈ విగ్రహం నిర్మాణం అక్టోబర్ 2014లో ప్రారంభించి అక్టోబర్ 2018 లో అంటే 4 సంవత్సరాల కాలంలోనే పూర్తి చేశారు. ఐక్యతా ప్రతిమను సర్దార్ వల్లభభాయి పటేల్ 143వ జయంతి సందర్భంగా 2018 అక్టోబర్ 31వ తేదీన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గుజరాత్‌లో 182 నియోజక వర్గాలున్న నేపథ్యంలో పటేల్ విగ్రహం ఎత్తు 182 మీటర్లు ఉండేట్లుగా నిర్మించారు. ఈ విగ్రహం ఎత్తు 597 అడుగుల ఎత్తుతో 19వేల చదరపు కిలోమీటర్ల వ్యాసార్థంలో 3000 కోట్ల భారీ ఖర్చుతో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం 75వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్, 5వేల 700 టన్నుల ఉక్కు, 18వేల 500 టన్నుల స్టీలు రాడ్లు, 22వేల 500 టన్నుల రాగి షీట్లు వినియోగించారు. 2500 మందికి పైగా కార్మికులు పనిచేశారు. అమెరికాలోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహానికి రెండింతలు పెద్దదియైన సర్దార్ పటేల్ ఐక్యత స్మారక చిహ్నం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం కావడం భారతీయులకు గర్వకారణం.

# అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం

అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము. రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది. మహాత్మా గాంధీతో వ్యక్తిత్వానికి ప్రభావితులై, ఉద్యోగం వదిలి దాదాపు రెండు దశాబ్దాలు శ్రీరాములు సన్నిహితంగా మెదిలారు. జాతిపిత అహింస సిద్ధాంతాన్ని విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. అదే మార్గంలో దీక్ష చేయాలని నిర్ణయించారు.

అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సందర్భంగా.. తనకు ఎదురవుతున్న సవాళ్లను తెలియజేస్తూ శ్రీరాములు రాసిన లేఖకు సమాధానంగా గాంధీజీ స్వదస్తూరితో ఇచ్చిన జవాబు... 'అన్ని విధాలుగా ప్రచారాన్ని కొనసాగించు. కానీ ఇప్పుడే దీక్ష వద్దు' అని గాంధీ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. "మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి" అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది". తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. "ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు" అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. "మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు.

మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు. 1952 అక్టోబరు19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు. దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు.. "ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది.

దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది." ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు. 1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం. 2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. " పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. "మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు." "మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా!

అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15–20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృధా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే థార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి." అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952) ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.

57వ రోజు ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు. తన ఆశయసాధనలో ప్రాణాలర్పించి అమరజీవి అయ్యాడు. డిసెంబర్ 16వ తేదీన రెండెడ్ల బండి మీద కట్టిన రథంపై శ్రీరాములు అంతిమ యాత్ర జరిగింది. మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు.

ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఎన్నికలకు సిద్ధం అవుతున్న వైసీపీ

గుంటూరు, డిసెంబర్ 14, ఏపీలో పోయిన చోట వెతుక్కోవడంతో పాటు రాబోయే ఎన్నికలకు కార్యకర్తలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటోంది. ఏపీలో ప్రభుత్వాలు ఏవైనా పరిణామాలు ఎలా ఉన్నా విజయం మాత్రం తమదే అంటూ ధీమా వ్యక్తం చేస్తోంది వైసీపీ. అసలు ప్రభుత్వ ఏర్పాటుపై వైసీపీ లెక్క ఏంటి..? ఎన్నికపై జగన్ వ్యూహాలు ఏంటి? ప్రభుత్వం తమదే అంటున్న వైసీపీ నేతల వ్యాఖ్యల వెనక ఉన్న ఆంతర్యం ఏంటి..? అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది.సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీకి పునర్వైభవం తీసుకువచ్చే దిశగా ఆ పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా మళ్ళీ పర్యటించి, ఏపీలో పట్టు నిలుపుకునేందుకు పార్టీ నేతలను కార్యకర్తలను ఆ పార్టీ అధినాయకత్వం ఇప్పటినుంచే సిద్ధం చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి ఫలితాల తర్వాత ఆయా లోటుపాట్లను సరిదిద్ది, నూతన ఉత్సాహంతో ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేస్తోంది వైసిపి.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కార్యకర్తల్లో నేతలు అంతా చెల్లా చదురవడంతో వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు నేరుగా వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ బాధ్యతలను భుజానికి వేసుకున్నారు. అందులో భాగంగానే ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు నెలల్లోనే కొత్త జిల్లా కమిటీలు,కొత్త అధ్యక్షులు,నూతన నియోజకవర్గ సమన్వయ కర్తలు, నూతన అనుబంధ సంఘాల విభాగాల నేతలను నియమించి పార్టీలో కొత్త జోష్ తీసుకొస్తున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మానిటర్ చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త టీములను సైతం సిద్ధం చేసుకుంటున్నారు వైఎస్ జగన్. ఎన్నికల ఫలితాలపై ఇప్పటికే అన్ని లెక్కలను సిద్ధం చేసుకున్న వైసీపీ, అధినాయకత్వం ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, ఇప్పటి నుంచే తమ కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.ఎన్నికల ఫలితాలతో వైసీపీ పూర్తిగా డీలాపడటంతో ఇప్పటి నుంచే ఎన్నికల కోసం వైసీపీ లెక్కలు చేస్తోంది. 2019 ఎన్నికల ఫలితాలను పునరావృతం చేయాలన్న సంకల్పంతో ప్రస్తుతం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకుంటుంది. జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిన నేపథ్యంలో జమిలి ఎన్నికలు వస్తాయన్న యోచనలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆయా ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ విజయం సాధిస్తుందన్న ఆశాభావం చేస్తుంది.అందులో భాగంగానే గత ఎన్నికల్లో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా కేడర్‌కు, లీడర్లకు మధ్య గ్యాప్ లేకుండా ఎన్నికల కోసం సమాయత్తం చేస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే జిల్లాల పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటున్న వేళ జమిలి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్తకు ప్రతి నేతకు భరోసా ఇచ్చే దిశగా జగన్ అడుగులు వేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే అధినాయకత్వం సైతం రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ సమస్యలపై ఆందోళన చేపట్టడంతో పాటుగా పార్టీకి దూరంగా ఉన్న ప్రతి కార్యకర్తను దగ్గర అయ్యేలా చూడాలంటూ ఆయా జిల్లా నాయకత్వాలకు రాష్ట్ర అధినాయకత్వం స్పష్టమైన ఆదేశాలను పంపింది.ఇప్పటికే వైఎస్ జగన్ కార్యకర్తలపై దాడులు ప్రతి దాడులు జరిగిన చోట పరామర్శల పేరుతో పర్యటనలు చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల పరిధిలో పార్టీ పరిస్థితి నాయకత్వం మార్పు కొత్త అధ్యక్షులు నియామకం రీజనల్ కోఆర్డినేటర్ల బాధ్యతలు అప్పగించడం లాంటి అంశాలను ప్రత్యేకంగా తీసుకొని ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయం వేదికగా వరుస సమావేశంలో నిర్వహించడంతోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు పార్టీ తరపున ఎన్నికైన ప్రతి ఒక్కరికి పార్టీ తరపున భరోసా ఇస్తూనే జమిలి ఎన్నికలకు సిద్ధం కావాలంటూ జగన్మోహన్ రెడ్డి నేరుగా పిలుపునిస్తున్నారు.జమిలి ఎన్నికలను పెంచాలని కేంద్రం అడుగులు వేస్తున్న వేళ ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సైతం అందుకు తగ్గట్టుగానే తన కార్యాచరణను సిద్ధం చేసుకుంటుంది. జమిలి ఎన్నికలకు తాము మొదటి నుంచి ఆమోదం తెలిపామన్న విషయాన్ని స్పష్టం చేస్తూనే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము విజయం సాధిస్తామంటూ కార్యకర్తలకు నేతలకు భరోసా ఇస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జరిగిన పరిణామాలు దృష్ట్యా తమకంటూ ఉన్న ఓటు బ్యాంకు ఎక్కడకు దూరం కాలేదని అధిష్టానం భావిస్తోంది. పార్టీ తరపున జరిగిన లోటు పాట్ల చెక్ పెట్టామని, ఏపీలో ప్రజలు మళ్లీ తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని వైసీపీ నేతలు అంటున్నారు. జగన్ మోహన్ రెడ్డి పరిపాలన పరమైన అంశాల విషయంలో ప్రజల్లో ఎక్కడ ఇబ్బందులు లేవని, జమిలి ఎన్నికలను వైసిపి స్వాగతిస్తుందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము విజయం సాధిస్తామంటూ వైసీపీ అధినాయకత్వం స్పష్టంగా చెబుతోంది.అందులో భాగంగానే ఎప్పటి నుంచే పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకుంటూనే మరోసారి అధికారాన్ని చేపట్టడమే లక్ష్యంగా జమిలి ఎన్నికలకు సిద్ధమవుతామని వైసీపీ ప్రకటిస్తోంది. ఇదే అంశాన్ని వైఎస్ జగన్ మీడియా సమావేశం వేదిక స్పష్టం చేశారు. జెమిలి ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము సిద్దంగా ఉన్నామని ఆ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన నిర్మోహమాటంగా చెప్పేస్తున్నారు.ఇదిలా ఉంటే జమిలి ఎన్నికలపై వైసీపీ వేస్తున్న లెక్కల విషయంలో కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నమైన ప్రకటన చేస్తోంది. జెమిలి ఎన్నికలు ఎప్పట్లో లేవని కేవలం పార్టీ కార్యకర్తలను నేతలను నాయకత్వాన్ని దగ్గర చేసుకునే ప్రయత్నంలో భాగంగాని జెమిలి ఎన్నికలంటూ కొత్త అంశాన్ని వైసీపీ తెరపైకి తీసుకువచ్చిందంటున్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు కొత్త ఎత్తులు వేస్తోందని రాష్ట్రమంత్రులు ధ్వజమెత్తారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం సాధిస్తామన్న ప్రకటనను పదేపదే చెప్పి పార్టీకి దూరమైన కార్యకర్తలను నేతలను దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారని, వరసగా పార్టీని వీడుతున్న నేతల విషయంలో ఏం చేయాలో అర్థం కాని వైసీపీ అధినాయకత్వం జెమినీ పేరుతో రాంగ్ ట్రాక్ పట్టిస్తున్నారు అంటూ మంత్రులు మండిపడుతున్నారు. ఎన్నికలు ఏమైనా ఎప్పుడు వచ్చినా కూడా మళ్లీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారులకు వస్తుందంటూ స్పష్టం చేస్తున్నారు. మొత్తానికి ఏపీలో ఎన్నికల సంగతి అటూ ఉంచితే, అధికార, విపక్షాలు ఎవరికి వారు కొత్త లెక్కలను సిద్ధం చేసుకుంటారు.

# పేదరికం-బాలకార్మిక వ్యవస్థ!

కాలచక్రం తిరుగుతూనే ఉంది. పేదల, ధనికుల వ్యత్యాసం కొనసాగుతూనే ఉంది. ప్రజల విభజనే కాకుండా ప్రపంచ దేశాల మధ్య అ విభజన ఏర్పడింది. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు, వెనుకబడిన దేశాలుగా ప్రపంచ విభజించబడింది. సామ్రాజ్యవాద దేశాలు మిగతా దేశాల, ముఖ్యంగా వెనుకబడిన దేశాల సహజ వనరులను, సంపదలను తరలించుకుపోతుంటే, సామ్రాజ్యవాదంతో కుమ్మక్కు అయిన వివిధ దేశాల బడా పెట్టుబడిదారులు, బడా భూస్వాములు, ఆ వర్గాలకు ప్రాతినిధ్య వహిస్తున్న ప్రజావ్యతిరేక ప్రభుత్వాలు ప్రజాసంపదలను దోచుకుంటున్నాయి. ఫలితంగా ప్రపంచంలో పేదరికం ఒక పక్క, కొద్ది మంది వద్ద సంపద కేంద్రీకరణ మరోపక్క ఉంది. పేదరికం ఫలితంగా, పేద కుటుంబాలు ముఖ్యంగా వెనుకబడిన దేశాల పేదలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఫ్యాక్టరీల్లో, సేద్యపు భూముల్లో పగలు, రాత్రి పని చేసినా వారి కుటుంబ పోషణ సమస్యగా మారింది. ఆటపాటలతో, బడికి వెళ్లి చదువుకోవాల్సిన వారి పిల్లలను కుటుంబ పోషణలో భాగస్వాములుగా పనులకు పంపుతున్న ఫలితంగా వారు బాలకార్మికులుగా మారుతున్నారు. పేదల కుటుంబాల ఆదాయంలో, పిల్లల ద్వారా వచ్చే ఆదాయం 25 నుండి 40 శాతంగా ఉంది. ప్రపంచంలో పేద కుటుంబాల్లో కోట్లాది పిల్లలు ఉన్నారు. బాల కార్మికులు : 19వ, 20వ శతాబ్దంలో అనేక దేశాల్లోని 5 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలకార్మికులు ఒకే విధంగా పని చేస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయం, గృహ ఆధారిత, కర్మాగారాల, మైనింగ్, రెస్టారెట్లు, పాడి పరిశ్రమ, న్యూస్ పేపర్ల బాయ్స్ వంటి పనులు చేస్తున్నారు.

2023 నాటికి ప్రపంచంలోని అత్యంత పేద దేశాల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు బాల కార్మికునిగా ఉన్నారు. వీరిలో అత్యధిక సంఖ్యలో సబ్ – సహారా ఆఫ్రికాలో నివసిస్తున్నారు. ఇక్కడ ప్రతి నలుగురిలో ఒకరి కన్నా ఎక్కువ మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారు. 2017లో ఆఫ్రికా దేశాలైన మాలి, బెనిన్, చాడ్, గినియా బిస్సౌలలో 5 నుంచి 14 సంవత్సరాల పిల్లల్లో 50 శాతం పైగా బాల కార్మికులు పనిచేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది బాల కార్మికులు వ్యవసాయ రంగంలో పని చేస్తున్నారు. యునిసెఫ్, అంతర్జాతీయ కార్మిక సంస్థల లెక్కల ప్రకారం 2021లో ప్రపంచ వ్యాప్తంగా 5 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల బాల కార్మికులు 168 మిలియన్ల మంది ఉన్నారు. వీరితో పాటు కోవిడ్ 19 కాలంలో మరో 9 కోట్ల మంది బాల కార్మికులుగా మారారు. ఆసియా ఖండంలో 22%, ఆఫ్రికాలో 32%, లాటిన్ అమెరికాలో 17% మంది బాల కార్మికులుగా పని చేస్తున్నారు. ఆసియాలోనే 114 మిలియన్ల మంది బాల కార్మికులు ఉన్నారు. మాపుల్ క్రాఫ్ట్ చైల్ లేబర్ ఇండెక్స్ 2012 ప్రకారం ప్రపంచ వ్యాపితంగా పని చేస్తున్న 76 కంపెనీలు విపరీతంగా బాల కార్మికులచేత పని చేస్తున్నాయి. ఫ్యాక్టరీ యజమానులు, పెద్ద గృహ యజమానులు, రెస్టారెంట్ల యజమానులు తక్కువ వేతనాలతో బాలకార్మికుల చేత ఎక్కువ పనిచేస్తున్నారు. వారి శ్రమ ద్వారా అధికంగా లాభం పొందుతున్నారు. బాలలు మాత్రం శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

భారతదేశంలో : భారతదే శంలో పేదరికం, అధిక నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి కారణాలతో లక్షలాది మంది పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. సేవ్ ది చిల్డ్రన్స్ నివేదిక ప్రకారం 14 -17 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు ప్రమాదకరమైన పనుల్లో ఉన్నారు. భారత శ్రామిక శక్తిలో బాల కార్మిక శక్తి 62.8 శాతంగా ఉంది. బాలికల కంటే బాలురు ఎక్కువగా ఉన్నారు. బాల కార్మికులు గ్రామీణ భారతంలో ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ 80% పిల్లలకు పని కల్పించింది. భారత దేశం వ్యవసాయ దేశం కావటం, అత్యధిక ప్రజలు గ్రామీణ ప్రాంతంలో ఉండటమే అందుకు కారణం. పాలకుల విధానాల వల్ల గ్రామీణ ఉపాధి తగ్గుతూ ఉండటం వల్ల, బాల కార్మికులు గ్రామీణ ప్రాంతం నుంచి పెద్ద పట్టణాలకు వలసపోతున్నారు. ఫలితంగా పట్టణాల్లో బాల కార్మికుల సంఖ్య పెరుగుతూ ఉంది. బాల కార్మికులపై జరిగిన ఒక అధ్యయనం ప్రకారం భారత దేశంలో 1,26,66,377 మంది బాల కార్మికులు ఉన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 19,27,997 ఉండగా, దేశ రాజధాని ఢిల్లీలో 10 లక్షల పైగా ఉన్నారు. భారత ప్రభుత్వ నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం దేశంలోని ముస్లిం జనాభాలోనే ఎక్కువ మంది బాల కార్మికులు ఉన్నారు. ఈ ఎక్కువ 40%గా ఉంది. అందుకు కారణం ఆర్థికంగా, సాంఘికంగా బాగా వెనుకబడి ఉండటం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటమే.

బాల కార్మికుల సమస్యలు: పిల్లలు బాల కార్మికులుగా మారటం వల్ల, వారిని బాల్యానికి దూరం చేస్తుంది.

వారి భద్రత, శారీరక, మానసిక ఆరోగ్యం ప్రభావం చూపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా వంద మంది పిల్లల్లో 16 మంది బాల కార్మికులుగా దోపిడీకి గురవుతున్నారు. గనులు, కర్మాగారాల్లో ప్రమాదకరమైన పనులు చేస్తున్నారు. అక్రమ రవాణా ద్వారా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. పిల్లలుగా విక్రయించబడుతున్నారు. కుటుంబ అప్పులు తీర్చటానికి పిల్లల చేత బలవంతంగా పని చేయిస్తున్నారు.

గనుల్లో పని చేసే పిల్లలు సొరంగం కూలిపోవటం వల్ల, ప్రమాదవశాత్తు పేలుళ్ల జరగటం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదకర పదార్థాల వాసనలు పీల్చటం వల్ల ఊపిరి తిత్తుల వ్యాధులకు లోనవుతున్నారు. పెద్ద కార్మికులు ప్రవేశించలేని చిన్న సొరంగాల్లోకి బాల కార్మికులను పంపుతున్నారు. ఫలితంగా వెన్నెముక గాయాలకు గురవుతున్నారు. నేరుగా నడవలేకపోతున్నారు. బాలికలు లైంగిక దోపిడీ గురికావటమే కాకుండా వ్యభిచారంలోకి లాగబడుతున్నారు. బాల కార్మిక (నిషేదం, నియంత్రణ) చట్టం1986లో ఈ చట్టం చేయబడింది. ఈ చట్టం 14 సంవత్సరాలు పూర్తి గాని పిల్లలను గుర్తించి, బాల కార్మికుల పని గంటలు, పని పరిస్థితులను నియంత్రించటం, ప్రమాదకరమైన పరిశ్రమల్లో బాల కార్మికులను ఉపయోగించకుండా నిషేధించటం ఈ చట్టం లక్ష్యం. ఈ చట్ట నిర్దేశాలు మాత్రం అమలు జరగటం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలు అనేక పరిశ్రమల్లో బాల కార్మికులుగా పని చేస్తూనే ఉన్నారు.

బాల కార్మిక సవరణ చట్టం: 2016లో సవరించబడిన ఈ బాలకార్మిక చట్టం ఈ విధంగా పేర్కొంది. అన్ని వృత్తులలో పిల్లలచే పని చేయించటాన్ని నిషేధించటం, ప్రమాదర పనుల్లో, ప్రక్రియల్లో యుక్తవయస్కులు నిమగ్నమవ్వటాన్ని నిషేధించటంగా చెప్పింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన యజమానులకు కఠినమైన శిక్షలు విధిస్తుంది.అనేక సార్లు సంప్రదింపులు జరిపిన తర్వాత చట్టంలో మరిన్ని సవరణలు చేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. చైల్డ్ లేబర్ ( నిషేధం–, నియంత్రణ) సవరణ నియమాల కింద నిబంధనలు ఇలా ఉన్నాయి. పిల్లలు, కౌమార దశలో ఉన్న కార్మికుల నివారణ, నిషేధం, పునరావాసాన్ని విస్తృతం చేయటం, పని గంటలు, పని పరిస్థితులకు సంబంధించి చట్టప్రకారం పని చేయటానికి అనుమతించబడిన కార్మికుల రక్షణ కల్పించటం. బాల కార్మికుల కోసం చేసిన కార్మిక చట్టాలు, వారి హక్కుల కోసం చేసిన చట్టాలు ఏవీ ఆచరణలో అమలు జరగటం లేదు. ప్రభుత్వాలు చట్టాలు చేయటానికే పరిమితం అవుతూ ఆచరణను పక్కన పెడుతున్నాయి. అసలు చట్టాల పట్ల పాలకులకు చిత్తశుద్ధే లేదు. అందువల్ల పాలక ప్రభుత్వాలు చేసిన చట్టాలు, బాల కార్మికులకు నిరుపయోగంగా మారాయి. చట్ట విరుద్ధంగా బాల కార్మికుల చేత పని చేయిస్తున్న ఫ్యాక్టరీల యజమానులు సంపన్న కుటుంబాల యజమానులు ఎటువంటి శిక్షలకు గురికావటం లేదు.

పేదరికానికి, బాల కార్మిక వ్యవస్థకు అవినాభావ సంబంధం ఉంది. పేదరికం పోకుండా బాల కార్మిక వ్యవస్థ తొలగిపోదు. పేద కుటుంబాలు, తమ ఆర్థిక పరిస్థితుల వల్లే పిల్లలను పనులకు పంపుతున్నారు. పేదల ఆర్థిక పరిస్థితి మారితే, వారి పిల్లలు బాలకార్మికులుగా మారరు. అందుకు పేదలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారం కావాలి.

గ్రామీణ పేదలకు భూమి పంపిణీ జరగాలి. ఫ్యాక్టరీల్లో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి. గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలి. నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలి. పాలకుల వర్గ స్వభావం ఇందుకు విరుద్ధమైంది. గ్రామీణ, పట్టణ పేదలు ఐక్యంగా ఉద్యమించటం ద్వారా వాటిని సాధించుకోవాలి.

## వైసీపీలో ఆగని షాక్ లు

విజయవాడ, డిసెంబర్ 14, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీపికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉదయం మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేశారు. మధ్యాహ్నం భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ ఆ పని చేశారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించి లేఖ రిలీజ్ చేశారు ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి గ్రంథి శ్రీనివాస్ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీకి దూరంగా ఉన్నారు. ఇతర పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీతో చర్చలు పూర్తయ్యాయో కానీ ఆయన రాజీనామా చేశారు. ఇటీవల గ్రంథి శ్రీనివాస్ ఇంట్లో ఐటీ దాడులు జరిగాయి. దాదాపుగా వారం రోజుల పాటు ఆయన వ్యాపార వ్యవహారాల్లో ఉన్న అవకతవకలన్నింటినీ వెలికి తీశారని ప్రచారం జరుగుతోంది. అంతకు మందు నుంచే ఆయన వైసీపీకి దూరంగా ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అప్పటి విపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడటంతో వైసీపీ ఉంటే తనకూ ఇబ్బందులేనన్న ఉద్దేశంతో ఆయన కొంత కాలంగా సైలెంట్ గా ఉన్నారు. దీనికి కూడా ప్రత్యేకమైన కారణం ఉంది. అదేమిటంటే.. ఆయన 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పై గెలిచారు. ఆ తర్వాత పవన్ పై అనేక అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. పలు మార్లు భీమవరంలో జనసేన, వైసీపీ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచార సమయంలో భీమవరంలో గ్రంధి శ్రీనివాస్ పై తీవ్ర విమర్శలు చేశారు. రౌడీయిజం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి వ్యాపారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రౌడీయిజాన్ని అణిచి వేస్తామని హెచ్చరించారు. దీంతో కూటమి గెలిచిన తర్వాత తనకు చిక్కులు తప్పవని ఆయన అనుకుంటున్నారు. అయితే ఆయనను జనసేన పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు. టీడీపీ లేదా బీజేపీలో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేశారని అంటున్నారు. కానీ ఆయనకు గ్రీన్ సిగ్నల్ రాలేదని చెబుతున్నారు. వైసీపీకి రాజీనామా చేసే నేతల సంఖ్య వరుసగా పెరుగుతోంది. ఇప్పటికే మెజార్టీ సీనియర్ నేతలు యాక్టివ్ గాలేరు. వారిలో వరుసగా రాజీనామా బాట పడుతున్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వంపై పోరుబాట పట్టాలని జగన్ అనుకుంటున్న సమయంలో ఇలా వరుసగా నేతలు ఒకరి తర్వాత ఒకరు గుడ్ బై చెబుతూంటడం.. ఆ పార్టీ పెద్దల్ని కూడా కలవర పరుస్తోంది.

## కూటమి వైపు వైసీపీ చూపులు

విజయవాడ, డిసెంబర్ 14, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఏదో ఓ కూటమిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇండియా కూటమి నేతృత్వం నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలిగి మమతా బెనర్జీ నాయకత్వంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాను సిద్ధమేనని మమతా బెనర్జీ ప్రకటించిన తర్వాత అనూహ్యంగా పలు పార్టీలు మద్దతు పలికాయి.

ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు దీదీ నాయకత్వానికి ఓకే అంటే సరే అనుకోవచ్చు కానీ జగన్ నేతృత్వంలోని వైసీపీ కూడా మద్దతు పలికడం రాబోతున్న మార్పులకు సూచనగా మారింది. ప్రస్తుతం ఇండియా కూటమి చీలిక దిశగా ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా లేదు. హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఆప్ ను పట్టించుకోలేదు. ఇప్పుడు ఆప్ .. కాంగ్రెస్ ను పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ను కాదని ప్రాంతీయ పార్టీల నేతలే కూటమికి నేతృత్వం వహించాలని కోరుకుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, అఖిలేష్ యాదవ్ వంటి వారు ఈ డిమాండ్ ను సమర్థిస్తున్నారు. ఇతర పార్టీలు కూడా ఓకే అంటే.. నాయకత్వం మారే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై కూటమిని నిర్మించే బాధ్యత ప్రాంతీయ పార్టీలకు ఇచ్చే అవకాశాలనుపరిశీలించే చాన్స్ ఉందని అనుకుంటున్నారు. విజయసాయిరెడ్డి ఇండియా కూటమికి దీదీ నాయకత్వం వహిస్తే బాగుంటుందని ప్రకటించేశారు. మామూలుగా అయితే ఆ కూటమికి ఎవరు నేతృత్వం వహిస్తే మాకేంటి అంటారు కానీ ఆయన తీరు మాత్రం వేరుగా ఉంది. ప్రస్తుతం వైసీపీ అత్యంత బలహీనంగా ఉంది. అసెంబ్లీకి వెళ్లడం లేదు. ఈ పరిస్థితులు చూస్తే రానున్న రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. వీటిని ఎదుర్కోవాలంటే తమకు ఓ కూటమి మద్దతు ఉండాలని అనుకుంటున్నారు. కాంగ్రెస్ ఉన్న కూటమిలో చేరడానికి ఇంత కాలం సంశయిస్తూ వస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు కాంగ్రెస్ మినహా మిగతా ఇండియా కూటమి పార్టీలన్నీ హాజరయ్యాయి. ఇప్పుడు ఆ వ్యూహం వెనుక ఉన్న రాజకీయం వెలుగులోకి వస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మమతా బెనర్జీ నేతృత్వంలో త్వరలో ఇండియా కూటమి పునర్ వ్యవస్థీకరణ జరగనుంది. కాంగ్రెస్ పార్టీ ఉంటుందో ఉండదో కానీ.. వైసీపీ చేరడం మాత్రం పక్కా అని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మమతా బెనర్జీ కూడా నేరుగా జగన్ తో సంప్రదింపులు జరుపుతున్నారని అంటున్నారు. ఇంత కాలం బీజేపీతో లొల్లి పెట్టుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడని జగన్ ఇప్పుడు ఆ పార్టీని నమ్మడానికి సిద్ధంగా లేరు. అందుకే ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారన్న అభిప్రాయం ఢిల్లీలో గట్టిగా వినిపిస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఇంకా ఏడాది పూర్తి కాలేదు. రానున్న ఐదేళ్లు పార్టీ నుంచి మరిన్ని ఒత్తిళ్లు ఉంటాయని భావిస్తున్నారట. పార్టీలో ఉండి కష్టాలు కోరి తెచ్చుకునే కంటే, రాజీనామా చేస్తే బెటరని అనుకుంటున్నారు. ఇటు పార్టీకి.. అటు ప్రభుత్వానికి దూరంగా ఉంటే ఎలాంటి సమస్యలు ఉండదన్నది ఆయా నేతల ఆలోచన.మరికొందరికి సొంత నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి.

అధిష్టానం వద్ద ఎంత మొరపెట్టుకున్నా, ఫలితం లేకపోయింది. ఫలితంగా ఫ్యాన్‌కి దూరంగా ఉండేందుకు సిద్ధపడుతున్నారు. ఇంకొందరు నేతలు ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.ప్రస్తుతం కూటమి సర్కార్‌కు కేంద్రం నుంచి అన్నివిధాలుగా సహాయ సహకారాలున్నాయి. కూటమిలో చీలిక వచ్చే ప్రసక్తి లేదని భావిస్తున్నారు. ఒకవేళ వైసీపీ పుంచుకున్నా, మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని, కాకపోతే బలమైన ప్రతిపక్షంగా తయారు కావచ్చనే అంచనాలు లేకపోలేదు. ఆ లెక్కన దాదాపు పదేళ్లు ప్రతిపక్షానికి పరిమితం కావాల్సి ఉంటుందన్నమాట.ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే టీడీపీ, లేదంటే జనసేన, ఇంకా లేదంటే బీజేపీ వైపు వెళ్తే సేఫ్‌గా ఉండవచ్చని భావిస్తున్నారట. ఇప్పటికిప్పుడు కాకపోయినా ఫ్యూచర్‌లో బెటర్ లైఫ్ ఉంటుందనేది నేతల భావన. రాబోయే ఐదేళ్లలో వైసీపీలో ఉండేదెవరు? వెళ్లిపోయేదెవరు? ఎందుకు ఆయా నేతలను ఆపే ప్రయత్నం చేయలేకపోతోంది? మొత్తానికి రాబోయే ఐదేళ్లు మాత్రం వైసీపీ గడ్డుకాలమేనని చెప్పక తప్పదు.

## టీడీపీ కండువాతో వైసీపీ నేతలవసూళ్లు

ఏలూరు, డిసెంబర్ 14, ఓ రోడ్‌పై అనధికారిక టోల్ గేట్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారన్న కారణంగా వైసీపీకి చెందిన ప్రేమే కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మెడలో పసుపు కండువాలు వేసుకుని ఓ రోడ్డు మీద టోల్ అనే బోర్డులు ఇద్దరు మనుషులతో ఏర్పాటు చేయించి .. ఓ సెక్యూరిటీ గార్డును కూడా పెట్టుకుని వచ్చి పోయే వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు ప్రేమ్ కుమార్ ను అరెస్టు చేశారు. ప్రభుత్వానికి, టీడీపీకి చెడ్డపేరు తెచ్చేందుకు ఇలా చేశాడన్న ఆరోపణలు టీడీపీ కార్యకర్తలు చేస్తున్నారు. టీడీపీ కండువాలతో టోల్ గేట్లు డబ్బులు వసూలు చేయడం వెనుక కుట్ర ఉందన్న ఉద్దేశంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు అయితే తాము నిరసన వ్యక్తం చేస్తున్నామని ఆ వైసీపీ నేతలు చెబుతున్నారు. ప్రేమ్ కుమార్ వీడియో మాత్రమే తీసుకున్నాడని ఎవరి దగ్గర డబ్బులు వసూలు చేయలేదని వైసీపీ నేతలు చెబుతున్నారు. వీడియోలో డబ్బులు ఇస్తున్న వారు కూడా ప్రేమ్ కుమార్ ఏర్పాటు చేసిన వ్యక్తులేనని అంటున్నారు.

కూటమి ప్రభుత్వం స్థానిక రహదారులపైనా టోల్స్ వసూలు చేయాలనుకుంటోంది కాబట్టి దానికి నిరసన వ్యక్తం చేశారని అంతే తప్ప డబ్బులు వసూలు చేయాలని కాదని మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసుల్ని కలిసి వివరించారు. సోషల్ మీడియా యాక్టివిస్టుల్ని అరెస్టు చేస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి ఇలా డబ్బులు వసూలు చేసుకునే పద్దతి ఎంచుకోవడం మాత్రం.. ఆ ప్రేమ్ కుమార్ ను జైలుకు పంపేలా చేసింది.

## ఏపీలో ఈవీ పాలసీ...

కాకినాడ, డిసెంబర్ 14, ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు ఊపు తెచ్చేలా కొత్త ఈవీ పాలసీను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేలా రాయితీలు ప్రకటించారు. కొనుగోలు దారులతో పాటు ఉత్పత్తిదారులకు కొత్త ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీలో రాయితీలు కల్పించారు.ఏపీలో కొత్త ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గత కొంత కాలంగా ఈవీలకు పన్ను ప్రోత్సహకాల విషయంలో ప్రతిష్టంభన నెలకొనడంతో వాహనాల కొనుగోళ్లు తగ్గిపోయాయి. పొరుగు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నా ఏపీలో కొంత జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఏపీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది.2024-29 మధ్య పాలసీ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొంది. విద్యుత్తు వాహనాల తయారీదారులతోపాటు కొనుగోలుదారులకూ రాయితీలు ప్రకటించింది.

కొత్త పాలసీలో ప్రయోజనాలు ఇవే..

ఎలక్ట్రిక్ బ్యాటరీల సాయంతో నడిచే ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్లకు ఇకపై ఏపీలో విక్రయ ధరలో 5 శాతం రాయితీ కల్పిస్తారు.

ఆర్వీఎస్ఎస్ ఆపరేటర్ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ తీసుకుంటే వాహనం ధరలో 10 శాతం రాయితీ లభిస్తుంది. 2027 మార్చి వరకు జరిగే విక్రయాలపై మాత్రమే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది.

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్డు ట్యాక్స్ మినహాయింపు ఇస్తారు. అయితే హైబ్రిడ్ వాహనాలకు ఈ మినహాయింపు వర్తించదు' అని పాలసీలో పేర్కొన్నారు.

ఎక్స్ షోరూమ్ ధరకు కూడా పరిమితి విధించింది. ద్విచక్రవాహనానికి గరిష్ఠంగా రూ. లక్ష, త్రి చక్ర వాహనానికి రూ.2 లక్షలు, సరకు రవాణా వాహనానికి రూ.5 లక్షలు, ట్రాక్టర్కు రూ.6 లక్షలు, విద్యుత్ బస్సుకు రూ.2 కోట్ల వరకు పరిమితిగా తీసుకుని ప్రభుత్వ రాయితీ వర్తింపజేస్తారు.

మొదటి 5 వేల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే వారికి ఖర్చులో 25% (గరిష్ఠంగా రూ. 3లక్షల) వరకు రాయితీ ఇస్తారు.

కొత్త పాలసీ లక్ష్యాలు?

2029 నాటికి 2 లక్షల విద్యుత్ ద్విచక్రవాహనాలు రిజిస్టర్ చేయడం, 2029 నాటికి కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త కార్లను తీసుకురావడంతో పాటు ఆర్టీసీలో నూరు శాతం విద్యుత్ బస్సుల వినియోగం లక్ష్యంగా పెట్టుకున్నారు.

30 కి.మీ.లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందు బాటులో తీసుకువస్తారు. ఈ–మొబిలిటీ నగరాల నిర్మాణానికి రూ.500 కోట్లతో కార్పస్ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ–మొబిలిటీ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు.ఈవీ రంగంతో అనుసంధానమైన భాగస్వామ్య పక్షాల నుంచి తీసుకున్న అభిప్రాయాలకు అనుగుణంగా పాలసీ విధానాలను ప్రభుత్వంరూపొందించినట్టు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విడిభాగాల తయారీ యూనిట్లు, పబ్లిక్, ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా చార్జింగ్/ స్వాపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు.రాష్ట్రంలో కొనుగోలు చేసిన విద్యుత్ వాహనాలు, రిజిస్ట్రేషన్ చేయడం, రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాప్ ఫెసిలిటీస్ (ఆర్వీఎస్ఎఫ్) ఆపరేటర్లు, ఈ– వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లు, ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు (ఏటీఎస్) ఏర్పాటు చేయడం చేస్తారు.

## జగన్ బెయిల్ రద్దవుతుందా...

కడప, డిసెంబర్ 14, వైసీపీ అధినేత జగన్ కొత్త సమస్య ఏర్పడిందా? ఆయన బెయిల్ రద్దు పిటిషన్‌పై జనవరి 10న తేల్చనుంది సుప్రీంకోర్టు. దీంతో ఆయన బెయిల్‌పై కంటిన్యూ అవుతారా? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా? సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లడం మాటేంటి? ఇవే ప్రశ్నలు వైసీపీ నేతలను వెంటాడుతున్నాయి.జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను జనవరి 10కి వాయిదా వేసింది.జగన్ అక్రమాస్తుల కేసు ట్రయిల్ సరిగా జరగలేదని, ఆలస్యమవుతోందని గతంలో రఘురామకృష్ణంరాజు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని అందులో పేర్కొన్నారు. గడిచిన 12 ఏళ్లుగా జగన్ బెయిల్ ఉన్నారని, రద్దు చేయకుంటే విచారణ తీవ్ర జాప్యం జరిగే అవకాశముందని మరో పిటిషన్ దాఖలు చేశారు.రఘురామరాజు వేసిన రెండు పిటిషన్లపై విచారణ చేపట్టింది న్యాయస్థానం. సీబీఐ, ఈడీ ఇచ్చిన నివేదికలు పరిశీలించాక తీర్పు వెల్లడిస్తామని స్పష్టం చేసింది ధర్మాసనం. తదుపరి విచారణను జనవరి 10కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం న్యాయస్థానానికి అందజేసినట్టు సీబీఐ లాయర్ వెల్లడించారు.

# చెత్తలోకి చేరుతున్న మిర్చి, టమాటా




కర్నూలు, డిసెంబర్ 14, నిన్న మొన్నటి వరకు చుక్కల్ని తాకిన టమాటా, మిర్చి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని ధరలు అమాంతం పెరిగితే ఇప్పుడు కొనేవాళ్లు లేక పారబోయాల్సి వస్తోంది. నిన్న మొన్నటి వరకు రూ.60–70 ఓ దశలో రూ.100 రుపాయలకు చేరువైన కిలో టమాటాను ఇప్పుడు వ్యవసాయ మార్కెట్లలో కనీసం రుపాయి ధరకి కూడా కొనడం లేదు. ఏపీతో పాటు తెలుగు రాష్ట్రాల మార్కెట్లకు కర్నూలు, మదనపల్లి మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున టమాటా విక్రయాలు జరుగుతుంటాయి. మూడు నెలల క్రితం అకాల వర్షాలతో పంటలు నష్టపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. కొత్త పంట చేతికి వచ్చే సరికి ధరలు పడిపోయాయి. దీంతో కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లో గురువారం టమాటా రైతులు ఆందోళనకు దిగారు. పత్తికొండ– గుత్తి రహదారిలో రైతుల ఆందోళనకు దిగారు.వ్యవసాయ మార్కెట్లలో టమాటా, మిర్చి ధరలు గురువారం ఒక్కసారిగా పడిపో యాయి. కిలో టమాటా రూపాయి కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు హతాశు లై మార్కెట్లలో పారబోశారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది.దళారుల దోపిడీని నిరసిస్తూ పత్తికొండ– గుత్తి ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. నాణ్యత ఉన్న పంటకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. మార్కెట్లలో వ్యాపారులు కుమ్మక్కై తక్కువకు ధరలకు వేలం పాడుతుండటంపై రైతులు రగిలిపోయారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో టమాటా పంట ఒక్కసారిగా రావడంతో ధరలు ఒక్కసారి పడిపోయినట్టు మార్కెట్ యార్డు కార్యదర్శి చెబుతున్నారు. వారం రోజు లుగా టమాటా ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా పూర్తిగా పడి పోలేదని నాణ్యతలేని పంటకు మాత్రమే వ్యాపారులు తక్కువ ధరకు అడిగారని తోటల్లో సాగు చేసిన టమాటా క్వింటాలు ధర రూ.1,800 వరకు పలికిందని మెట్ట భూముల్లో సాగు చేసిన పంట నాణ్యత దెబ్బతినడంతో తక్కువ ధర పలుకుతోందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రైతు బజార్లలో కిలో టమాటా ధర 25 గా ఉంది. కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో మాత్రం గురువారం కిలో ధర రుపాయి నుంచి 8 రూపాయల వరకు పలికింది. పత్తి కొండ వ్యవసాయ మార్కెట్‌లో నిత్యం 200 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయి. పత్తికొండలో కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో కూడా పంటలు అందుబాటులోకి రావడంతో పత్తికొండ నుంచి ఎగుమతి అయ్యే టమాటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ధర తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. గురువారం మార్కెట్లో కనీస ధరలు కూడా లేకుండా కొనడంపై రైతులు ఆగ్రహంతో టమాటాలను మార్కెట్లోనే పారబోసి వెళ్లిపోయారు. కొందరు పత్తికొండ రహదారిపై ఆందోళనకు దిగారు.బాపట్ల జిల్లా సంతమాగులూరులో మిర్చి ధరను తగ్గించడంతో రైతులు రోడ్డుపై పారబోశారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలు ధర రూ.3వేలు ఉంటే వ్యవసాయ మార్కెట్లో రూ.1200మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు పంటను చెత్తలో పారబోశారు. సంతమాగలూరు మండలం కొమ్మాలపాడులో చేలలో కోసిన పంటను చెత్త కుప్పలో పారబోశారు.

# కేంద్ర మంత్రిగా పవన్...



తిరుపతి, డిసెంబర్ 14, ఏపీ రాజకీయాల్లో ఊహించని మార్పులు జరగబోతున్నా యా? సీఎం చంద్రబాబు–డిప్యూటీ సీఎం పవన్ ఆలోచనకు మోదీ సర్కార్ ఓకే చెప్పిందా? జమిలి ఎన్నికల నేపథ్యంలో ఈ ప్లాన్ చేశారా? కేంద్రం నుంచి ఏపీకి పెద్ద మొత్తంలో నిధులు రావడం ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.దేశంలో జమిలి ఎన్నికలు వేడి కొనసాగుతోంది. దీనికి సంబంధించి రేపో మాపో మోదీ సర్కార్ పార్లమెంట్‌లో బిల్లు పెట్టబోతోంది. ఆ తర్వాత జేపీసీకి ఇవ్వాలని నిర్ణయించు కుంది. ఆ తర్వాత ఈ బిల్లుకు ఆరేడు సవరణలూ జరగనున్నాయి. కాకపోతే మోదీ సర్కార్‌ను ఒకటే వెంటాడుతోంది.ఈసారి సౌత్‌లో ఎక్కువ సీట్లు సాధించాలనే కమలనాథులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. రీసెంట్ జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ ఛరిష్మా కలిసొచ్చింది. దీంతో మూడింట రెండొంతుల మెజార్టీ బీజేపీ కూటమి దక్కించుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకుంది.పవన్ ఛరిష్మాను గుర్తించిన బీజేపీ పెద్దలు పవన్ కల్యాణ్ తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్ గా వినియోగించుకోవాలని భావిస్తోంది. అందుకు పవన్ అంగీకరిస్తారా? అన్నది అసలు పాయింట్. నార్త్‌లో బీజేపీ బలంగా ఉన్నా, సౌత్‌లో మాత్రం బలహీనంగా కనిపిస్తోంది. సీట్లు పెరిగిన సందర్భం కనిపించలేదు.

తమిళనాడు, కేరళ, కర్ణాటక ఇలా ఏ రాష్ట్రం చూసినా బీజేపీకి పెద్ద లోటు కనిపిస్తోంది. దాన్ని భర్తీ చేసేందుకు బీజేపీ హైకమాండ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. పవన్ కల్యాణ్ కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటే, దక్షిణాదికి సరైన స్టార్ క్యాంపెయినర్ లభించినట్లు అవుతుందన్నది కమలనాథుల ఆలోచనగా చెబుతున్నారు. దీనికితోడు జమిలి ఎన్నికలు 2028లో జరగడం ఖాయమనే ప్రచారం లేకపోలేదు.ఇక ఏపీ విషయానికొద్దాం.. రీసెంట్‌గా నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటన చేయడంతో తెలుగు తమ్ముళ్లు కాసింత అసహనం వ్యక్తం చేశారట. తక్కువ సీట్లు గెలిచిన వారికి ఒకే కుటుంబంలో రెండు మంత్రి పదవులు ఎలా ఇస్తారంటూ నేతల మాటల చర్చ సీఎం చంద్రబాబు చెవిలో పడింది.రీసెంట్‌గా సీఎం చంద్రబాబు–డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. ఈ క్రమంలో నాగబాబుకు మంత్రి పదవి ఇస్తే.. సీనియర్ల నుంచి ఏమైనా ఒత్తిడి రావచ్చనే చర్చ జరిగిందట. ఈ క్రమంలో నాగబాబు కేబినెట్‌లో చోటు కల్పించి, మోదీ కేబినెట్‌లోకి పవన్ వెళ్తే ఎలా వుంటుందనే చర్చ జరిగిందట.ఈ నేపథ్యంలో ఏపీ నుంచి ఓ వర్తమానం ఢిల్లీకి వెళ్లడం, అక్కడి బీజేపీ పెద్దలు అందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిపోయిందని పొలిటికల్ సమాచారం. మంత్రిగా ఉంటూనే నాగబాబు రాష్ట్ర వ్యవహారాలను చక్కబెట్టడానికి వీలవుతుందని అంటున్నారు.పవన్ కేంద్రమంత్రిగా ఉంటూ బీజేపీ పెద్దలతో నిత్యం టచ్‌లో ఉండటానికి ఇదొక మార్గంగా బాబు–పవన్ ద్వయం ఆలోచన. ప్రస్తుతం ఏపీ నుంచి ఇద్దరు కేంద్రమంత్రులున్నారు. అందులో ఒకరు రామ్మోహన్‌నాయుడు కాగా, మరొకరు పెమ్మసాని ఉన్నారు. దీనికి పవన్ కూడా తోడైతే రాష్ట్రానికి కావల్సిన నిధులు, ప్రాజెక్టులు తీసుకొచ్చే అవకాశముందని అంటున్నారు.

# నాగబాబు మంత్రి పదవికి స్మాల్ బ్రేక్



ఏలూరు, డిసెంబర్ 14, ఆలస్యం అమృతం విషం అంటారు. కొన్ని విషయాల్లో వెనువెంటనే పరిణామాలు జరిగితేనే సత్ఫలితాలు ఇస్తాయి. ఆలస్యం అయితే అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పుడు మెగా బ్రదర్ నాగబాబు విషయంలో అదే జరుగుతోందన్న అనుమానం ఉంది.ఏపీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది. అదే సమయంలో వైసీపీ పోరుబాట పట్టింది. ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్త నిరసనకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో రాష్ట్ర క్యాబినెట్లోకి మెగా బ్రదర్ నాగబాబును తీసుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అయితే దీనిపై కూటమిలోనే భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. విపక్షంలో ఉన్నప్పుడు కుటుంబ రాజకీయాలపై ఎక్కువగా మాట్లాడారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు ఒకే కుటుంబానికి అన్ని పదవులా అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఇంతవరకు నాగబాబు కు మంత్రి పదవి అన్న విషయంలో పవన్ కళ్యాణ్ స్పందించలేదు. దీంతో రకరకాల అనుమానాలు ప్రారంభం అయ్యాయి. సోషల్ మీడియాలో సైతం దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. అవి రకరకాల సందేహాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా దీనిని వైసిపి ప్రచారాస్త్రంగా మార్చుకుంటుంది.నారా కుటుంబానికి రెండు పదవులు ఉన్నాయి . రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారు. మంత్రిగా నారా లోకేష్ ఉన్నారు. మరోవైపు మెగా కుటుంబం నుంచి డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఇప్పుడు మంత్రిగా మెగా బ్రదర్ నాగబాబును తెస్తే.. రెండు కుటుంబాలే ప్రభుత్వాన్ని పంచుకుంటున్నాయి అన్న విమర్శ రాక మానదు. ఇప్పటికే వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వాన్ని మల్టీ స్టార్ గవర్నమెంట్ గా చెబుతున్నారు. అయితే ప్రభుత్వంలో నారా తో పాటు కొణిదల కుటుంబానికి ప్రాధాన్యం దక్కుతోంది. కానీ నందమూరి కుటుంబానికి చాన్స్ లేకుండా పోయిందన్న విమర్శ ఉంది.ఇంకోవైపు జనసేనలో సైతం మరోరకమైన విమర్శ ఉంది. జనసేన ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. మూడు మంత్రి పదవులను సొంతం చేసుకుంది. అయితే మంత్రులు ముగ్గురు అగ్రకులాలకు చెందిన వారే. అందులో ఇద్దరూ కాపు సామాజిక వర్గానికి చెందినవారు. మిగతా ఒకరు కమ్మ సామాజిక వర్గం. దీంతో బీసీలకు కనీస ప్రాతినిధ్యం లేకుండా పోయింది అన్న విమర్శ ఉంది. ఇప్పుడు జనసేనకు లభిస్తున్న ఆ ఒక్క మంత్రి పదవి బీసీలకు ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీ నుంచి వ్యక్తం అవుతోంది. ఈ పరిణామాల నడుమ నాగబాబు మంత్రి కావడం అనుమానంగా కనిపిస్తోంది. అయితే సాక్షాత్ సీఎం చంద్రబాబు ప్రకటించిన తర్వాత ఈ విషయంలో వెనక్కి తగ్గే పరిస్థితి లేదని తెలుస్తోంది. కానీ ఒక రకమైన అనుమానం మాత్రం వెంటాడుతోంది.

# రైతులకు బేడీ తలనొప్పి,..

హైదరాబాద్, డిసెంబర్ 14, గత ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 2023 ఎన్నికల్లో దాని ప్రభావం కనిపించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాంటి చర్యలకు దిగడం విమర్శలకు తావిస్తోంది.దేశానికి అన్నం పెట్టేది రైతులే. కానీ, రైతులకు.. వారి శ్రమకు గుర్తింపు, ఫలితం దక్కడం లేదు. ప్రభుత్వాల తీరుతో ఇబ్బంది పడుతున్నారు. దళారుల తీరుతో మోసపోతున్నారు. ఇటీవల రైతుల భూములు తీసుకోవడం ఉద్రిక్తతలకు దారితీస్తోంది. మల్లన్న సాగర్ భూసేకరణ సమయంలో గత బీఆర్ఎస్ ప్రభత్వం రైతులను, గ్రామస్తులను పోలీసులతో నిర్బంధించి భూములు లాక్కుంది. తాజాగా కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా సిటీ కోసం భూసేకరణకు సిద్ధమైంది. ఈ సమయంలో రైతులు అధికారులపై తిరగబడ్డారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే జైల్లో ఉన్న రైతులను బేడీలు వేసి తీసుకురావడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా హీర్యానాయక్‌ను జైలు నుంచి సంకెళ్లతో ఆస్పత్రికి తరలించారు. విమర్శలు రావడంతో జైలర్ సంజీవరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సూపరింటెండెంట్ సంతోష్‌పై శాఖాపరమైన చర్యలకు జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తాకు లేఖ రాశారు.హీర్యానాయక్ గురువారం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో పోలీసులు సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.ఈ సమయంలో ఆయనకు బేడీలు వేసి ఉండడం, ఆ పొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫైరల్ అయ్యారు. ఘటనపై ఆరా తీశారు. సంకెళ్లు ఎందుకు వేశాలరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. దీంతోరంగంలోకి దిగిన మల్టీజోన్?2 ఐజీ సత్యనారాయణ సంగారెడ్డికి వెళ్లి విచారణ చేపట్టారు.లగచర్ల ఘటన తర్వాత పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అందులో హీర్యానాయక్ కూడా ఉన్నారు. న్యాయస్థానం వారికి రిమండ్ విధించింది. దీంతో సంగారెడ్డిజైలుకు తరలించారు. బుధవారం ఛాతీలో నొప్ప రావడంతో జైలు అధికారులు ఎస్కార్ట్‌తో ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల తర్వాత జైలుకు తరలించారు. గురువారం మళ్లీ నొప్పుగా ఉందనడంతో మరోమారు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో చేతికి సంకెళ్లు ఉండడంతో కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఇదిలా ఉంటే.. హీర్యానాయక్‌ను ఆస్పత్రికి తరలించేందుకు సిబ్బందిని పంపించాలని జైలు సూపరింటెండెంట్ రాసిన లేఖలో పలు అంశాలు కలకలం రేపాయి. వాటిపై నిఘావర్గాలు ఆరాతీస్తున్నాయి. సాధారణంగా ఏసు నమోదు చేసిన పోలీసులు ఎస్కార్ట్ అడగాలి. కానీ, సూపరింటెండెంట్ వికారాబాద్ పోలీసులను కాకుండా సైబరాబాద్ పోలీసులకు లేఖ రాశారు. అందులో బాలానగర్ పీఎస్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. ఆ కేసు రోడ్డు ప్రమాదానికి సంబంధించినంది.ఇదిలా ఉంటే లగచర్ల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సురేశ్ ఫోన్‌లో మాట్లాడిన విషయం కూడా బైయటకు వచ్చింది. దీనిపై జైలర్ జీవన్‌రెడ్డిని డీజీ సస్పెండ్ చేశారు. ఏ2గా ఉన్న సురేశ్ ల్యాండ్ ఫోన్ నుంచి ఎవరితోనో మాట్లాడారిని మల్లీజోన్?2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఫోన్‌లో గుండెనొప్పి అని లాయర్లు, మీడియాకు సమాచారం ఇస్తే గంటలో బెయిల్ ఇస్తామని తెలిపాడు. మరోవైపు సూపరింటెండెంట్ లేఖపైనా విచారణ జరుపుతున్నారు.

# సంక్రాంతికి విస్తరణ పక్కా...

హైదరాబాద్, డిసెంబర్ 14, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. కేబినెట్ 12 మందితో ఏర్పడింది. ఆరు పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వాటి భర్తీకి లైన్ క్లియర్ అయింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ బెర్తుల ఖాళీలు భర్తీ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కసరత్తు మొదైలంది. కాంగ్రెస్ మార్కు రాజకీయాలు రాష్ట్రంలో ఊపందుకున్నాయి. తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణ కోసం అనుమతి తీసుకున్నారు. ఆరుగురి పేర్లు ఖరారు చేసుకుని వస్తారని తెలుస్తోంది. దీంతో ఆశావహులు అలర్ట్ అయ్యారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూడా మరో జాబితాతో ఢిల్లీ వెళ్లారు. ఆయన ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు మరికొంతమంది కోసం లాబీయింగ్ చేస్తున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా భట్టిని కలిశారు. తన పేరు సిఫారసు చేయాలని కోరారని సమాచారం.ఇదిల ఉంటే.. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఢిల్లీలో రచ్చ చేశారు. పార్టీలో పాత వారికన్నా కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస మున్షికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌ను చంపేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు మంత్రి పదవి ఆశిస్తున్న పలువురు హస్తిన బాట పట్టారు. సామాజిక సమీకరణలకు కేబినెట్‌ల్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.కేబినెట్ బెర్తుల భర్తీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆమె కూడా కొందరి పేర్లు సిఫారసు చేశారని సమాచారం. సీనియరుల, సీఎం, ఇన్‌చార్జి తమ తమ పేర్లతో ఢిల్లీ చేరుకున్నారు. ఇప్పుడు ఎవరి జాబితాకు హైకమాండ్ ఆమోదం తెలుపుతుందన్న టెన్షన్ నెలకొంది.మరోవైపు కేబినెట్ విస్తరణకు నల్గొండ నేతలు అడ్డు పడుతున్నట్లు తెలిసింది. నల్గొండ జిల్లా నుంచి ప్రస్తుత ఏబినెట్‌లో ఒకే సమాజికవర్గం నేతలు ఉన్నారు. కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కూడా ప్రయత్నం చేస్తున్నారు. ఈనేపథ్యంలో కేబినెట్ విస్తరణను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు కూడా కారణం. ఈ నేపథ్యంలో అధిష్టానం కూడా ఈ విషయంపై దృష్టిసారించింది. మరోవైపు తాజా విస్తరణలో హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది.

## బుగ్గ రాజరాజేశ్వర ఆలయంలో హుండీ చోరీ

బెల్లంపల్లి: బుగ్గ రాజరాజేశ్వర ఆలయంలో హుండీ చోరీ బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయితీ శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మరోసారి హుండీ చోరికి గురైంది. తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. బుగ్గ ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి చూడగా హుండీ దొంగిలించినట్లు పూజారీ గుర్తించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఇవాల్టి నుంచి గ్రూప్ 2...

హైదరాబాద్, డిసెంబర్ 14, తెలంగాణాలో గ్రూప్–2 పరీక్షలు ఈ నెల 15, 16వ తేదీల్లో జరగనున్నాయి. ఇప్పటికే హాల్ టికెట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్–2కి పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు ఇప్పటికే హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ పరీక్షల కోసం అభ్యర్థులు ఎంతగానే ప్రిపేర్ అయ్యారు. ఈ పరీక్షల కోసం ఎన్నో ఏళ్ల నుంచి కూడా ప్రిపేర్ అయ్యే వాళ్లు ఉంటారు. ఈ పరీక్షల కోసం టీజీపీఎస్సీ ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టింది. ఈ పరీక్ష మొత్తం నాలుగు పేపర్లు రెండు రోజులు జరగనున్నాయి. ఈ పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు కొన్ని విషయాలను తప్పకుండా తెలుసుకోవాలి. కొందరు అభ్యర్థులు జాగ్రత్త తీసుకోకుండా చేసిన కొన్ని తప్పుల వల్ల పరీక్ష రాయకుండా పరీక్ష సెంటర్ నుంచి తిరిగి వచ్చేస్తారు. ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడి చదివి పరీక్ష రాయకపోతే ఎంతో బాధగా ఉంటుంది. కాబట్టి పరీక్ష రాయాలంటే కొన్ని సూచనలు పాటించాలి.గ్రూప్–2 పరీక్ష రెండు రోజుల పాటు మొత్తం నాలుగు పేపర్లలో జరగనుంది.

డిసెంబర్ 15, 16వ తేదీల్లో రెండు రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు పేపర్–1 ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. తర్వాత రెండో పేపర్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుంది. సాయంత్రం 5:30 వరకు పరీక్ష జరగుతుంది. ఇదే సమయాల్లో 16వ తేదీన కూడా పరీక్షలు జరుగుతాయి. ప్రతీ పేపరులో ఒక్కో పేపరు 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి.గ్రూప్–2 పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు తప్పకుండా కొన్ని సూచనలు పాటించాలి. ఆఫ్‌లైన్ పద్ధతిలో పరీక్ష ఉంటుంది. కాబట్టి బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకెళ్లాలి. అలాగే హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. కొందరికి హాల్‌టికెట్‌లో ఫొటో బ్లర్ ఉంటుంది. అలాంటి వారు మూడు పాస్‌ఫొటోలను తప్పకుండా తీసుకెళ్లాలి. పాత పాస్ పోర్ట్ కాకుండా గత మూడు నెలల లోపలది అయి ఉండాలి. పరీక్ష్ ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. అంటే ఉదయం 8:30 గంటల పరీక్ష కేంద్రానికి అనుమతి ఇస్తారు. 9:30 లోపల వరకు మాత్రమే పరీక్ష సెంటర్‌లోకి అనుమతి ఇస్తారు. ఆ తర్వాత వెళ్లిన లోపలికి అనుమతించరు. మధ్యాహ్న సమయాల్లో అయితే 1:30 నుంచి 2:30 వరకు మాత్రమే పరీక్ష కేంద్రానికి అనుమతి ఇస్తారు. పరీక్ష రాసే అభ్యర్థులు చేతులకు మెహందీ, గోరింటాకు, తాత్కాలికమైన టాటూలు వంటివి ఉండకూడదు. వీటితో వెళ్తే పరీక్ష రాయకుండా తిరిగి వస్తారు. వీటితో పాటు పరీక్ష సెంటర్‌లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్లూ టూత్, పెన్ డ్రైవ్ వంటివి కూడా అనుమతించరు. అమ్మాయిలు చైన్, గాజులు, రింగులు, బొట్టు, హ్యాండ్ బ్యాగ్, వాచ్, రబ్బరు బ్యాండ్ వంటివి ధరిస్తే పరీక్ష సెంటర్‌లోకి అనుమతించరు.

# మళ్లీ ఎన్నికలు తప్పవా

దేశంలో రాజకీయ వ్యవస్థ అన్నింటికి ఆటంకంగా మారుతోంది. ఒకప్పుడు చాలా దేశాలకన్నా ముందు ఉన్న మన దేశం.. ఇప్పుడు మాత్రం వెనుకబడింది. దీనికి కారణం రాజకీయాలు.. తరచూ ఎన్నికలు జరగడమే. ఒప్పుడు వెనుకబడిన చైనా.. ఒకే పార్టీ అధికారంలో ఉండడంతో అభివృద్ధిలో దూసుకుపోతోంది. దీంతో మన దేశ అభివృద్ధికి ఆటంకం రాజకీయాలే అని చాలా మంది భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా దీనినే నమ్ముతున్నారు. ఈ క్రమంలోనే వన్ నేషన్, వన్ ఎలక్షన్‌ను తెరపైకి తెచ్చారు"వన్ నేషన్ వన్ ఎలక్షన్" అమలు కోసం రాజ్యాంగాన్ని సవరించడానికి కనీసం ఆరు బిల్లులు పాస్ చేయాల్సి ఉంటుందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అయితే దానికి ప్రభుత్వానికి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం ఉంటుంది. పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్‌డీఎకు సాధారణ మెజారిటీ ఉన్నప్పటికీ, ఏ సభలోనూ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడం చాలా కష్టతరమైన పనే చెప్పాలి. జమిలి ఎన్నికలకు సంబంధించి గతంలో కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతోన్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్రం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీని కోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు సమాయత్తం అవుతోంది. మొత్తం 2 దశల్లో ఎన్నికలు జరగనుండగా.. తొలి దశలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు.. అవి పూర్తైన 100 రోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీని కోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితా ఉపయోగించనున్నారు. జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ.. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లుకు సిఫార్సు చేయాలని సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం. దీని ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లతోనూ సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకూ అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించడంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో రూపొందించిన నివేదికను భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ ఏడాది మార్చిలో అందించారు. అనంతరం కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫార్సులకు కేంద్ర మంత్రివర్గం ఈ సెప్టెంబరులోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజా పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భావిస్తోన్న ప్రభుత్వం.. తాజాగా కేంద్ర కేబినెట్‌లో ఆమోద ముద్ర వేసింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనలను 30కి పైగా పార్టీలు సమర్థించగా.. కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంటోంది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతివ్వడం లేదని, ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని వాదిస్తోంది. ఇక ఎన్నికల వ్యవయం పెరుగుతుండడంతో నేతలు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారు. అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల కోసమే డబ్బులు పోగుచేసుకుంటున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నికయ్యే నేతల్లో చాలా మంది ఇప్పుడు సంపాదనే లక్ష్యంగా పోటీ పాలన సాగిస్తున్నారు. దీంతో రాజకీయాలు కాస్ట్లీ అయిపోయాయి. దీంతో నేతలు అవినీతి సొమ్మునే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. 2024 పార్లమెంటు ఎన్నికలు ముగిసిన ఆరు నెలల్లోనే ఐదు రాష్ట్రా?టల్లో ఎన్నికలు జరిగాయి. మరో రెండు నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత బిహార్, ఆ తర్వాత మరో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ పరిస్థితి మార్చాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే వన్ నేషన్, వన్ ఎలక్షన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక కమిటీ వేసి నివేదిక కోరింది. కమిషన్ అన్ని పార్టీలతో చర్చించి నివేదిక అందించింది. తాజాగా వన్ నేషన్, వన్ ఎలక్షన్‌కు కేబినెట్ ఆమోదం లభించింది. ఇక పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయడమే తరువాయి. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగం సవరించాల్సి ఉంటుంది. సుమారు 18 సవరణలు అవసరమని కమిషన్ సూచించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు జమిలీ ఎన్నికలే జరిగేవి. కానీ ప్రభుత్వాలు కూలిపోవడం, రాజకీయ అనిశ్చితితో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం, ప్రభుత్వాలు రద్దు చేయడం వంటివి జరుగుతున్నాయి. దీంతో ఏ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయో తెలియడం లేదు. ఫలితంగా దీనిని సరిచేయాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ముందు కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాల పరిమితిని తగ్గించాలి. రాజ్యసభలోని 245 సీట్లలో ఎన్డీఏకు 112, ప్రతిపక్ష పార్టీలకు 85 ఉన్నాయి. మూడింట రెండొంతుల మెజారిటీకి ప్రభుత్వానికి కనీసం 164 ఓట్లు అవసరం. లోక్‌సభలో కూడా 545 సీట్లకు గాను ఎన్‌డీఏకు 292 సీట్లు ఉన్నాయి. మూడింట రెండు వంతుల మెజారిటీ మార్క్ 364 వద్ద ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల విధానం వల్ల సమయం, డబ్బు, శ్రమ వృథా అవుతోందని ప్రభుత్వం కొంతకాలంగా ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించాలని ఎన్డీఏ సర్కార్ కంకణం కట్టుకుంది. అంటే.. జమిలి ఎన్నికల పట్ల వైసీపీ సానుకూలంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో.. జగన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే పనిలో పడ్డారు. అటు కేడర్ కూడా గతంలో పోలిస్తే.. కాస్త యాక్టివ్ అయ్యింది. జమిలి ఎన్నికలు జరిగితే తప్పకుండా మేలు జరుగుతుందని వైసీపీ భావిస్తోంది. ఇక టీడీపీ విషయానికొస్తే.. జమిలిపై ఇప్పటివరకు ఆ పార్టీ స్పందించలేదు. అదే సమయంలో.. జమిలి వస్తే ఎంతోకొంత నష్టం జరగొచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్టు సమాచారం. 2024 ఎన్నికల సమయంలో ఉన్న ఊపు, వైసీపీపై కోపం.. జమిలి ఎన్నికలు జరిగే నాటికి ఉంటుందా అనే చర్చ టీడీపీ వర్గాల్లో జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ అనుకున్నట్టు జరిగితే.. 2027 మార్చి తర్వాత ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది. అప్పటికీ పరిస్థితి ఇలానే ఉంటుందా అని టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు. జమిలి ఎన్నికలకు దేశంలోని 32 పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఎదుట 47 పార్టీలు వాదనలు వినిపించాయి. ఇండియా కూటమిలోని పలు పార్టీలు జమిలిని వ్యతిరేకిస్తున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటే స్థానిక ఎన్నికలనూ నిర్వహించాలని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకోసం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టాలని సూచించింది. అయితే స్థానిక ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి కేంద్రం పక్కనబెట్టింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. లోకల్ బాడీ ఎన్నికలనూ వాటితో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణ, 50 శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని అంటున్నారు. కొన్నిసార్లు అనేక దశల్లో జరిగే రాష్ట్ర ఎన్నికలను నిర్వహించడంలో పోల్ కమిషన్ ఎదుర్కొంటున్న లాజిస్టికల్ సవాలును ఎత్తి చూపుతూ ప్రతిపక్షం ఈ ఆలోచనను సరికాదని విమర్శిస్తుంది. ఆలోచన బాగుంది కానీ ఆచరణ కూడా బాగుండాలి. అనిశ్చితి ఉంటే ఏం చేయాలి, ప్రభుత్వాలు మధ్యలో కూలితే ఏమవుతుంది అన్నది కూడా స్పష్టత ఇవ్వాలి. సంకీర్ణాలు వస్తే పరిస్థితి ఏంటి అన్నది కూడా తెలియాలి. ఇందుకు జనంలో అవగాహన రావాలి. వీటిపైనే వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ విధానం సక్సెస్ అవుతుందా లేదా అన్నది ఆధారపడి ఉంటుంది.

# రేవంత్ ధైర్యం ఏమిటీ

హైదరాబాద్, డిసెంబర్ 14, అల్లు అర్జున్ అరెస్టు పై జరుగుతున్న చర్చ రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారాన్ని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఖండించారు. ట్విట్టర్ వేదికగా రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శించారు. అల్లు అర్జున్ అరెస్టుకు సంబంధించి.. తన ప్రమేయం ఏ మాత్రం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని వివరించారు. పుష్ప సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి హైదరాబాద్లోని ఆర్టీసీ ఎక్స్ రోడ్డు సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోయిందని.. ఆమె కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకే పోలీసులు చర్యలు తీసుకున్నారని.. అరెస్ట్ కంటే ముందు అల్లు అర్జున్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారని రేవంత్ వివరించారు. ఆ తర్వాత రేవంత్ అంతటితోనే ఆగలేదు. ఢిల్లీలో విలేకరులతో జరిగిన చిట్ చాట్ లో సంచలన వ్యాఖ్యలు చేశారు. " ఆయన ఏమైనా సరిహద్దుల్లో యుద్ధం చేశాడా? నాలుగు సినిమాలు చేశాడు.. అందులో పెట్టుబడి పెట్టాడు.. అంతకంటే ఎక్కువ పైసలు సంపాదించాడు. ఇవాళ ఏదో ఆయన అరెస్టు ను రకరకాలుగా చిత్రీకరించడం సరికాదని" రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో ఒక్కసారిగా మీడియాలో సంచలనం నమోదయింది. మీడియా కూడా అల్లు అర్జున్ అరెస్ట్ విషయాన్ని పక్కనపెట్టి.. అతడికి బెయిల్ వచ్చిన విషయాన్ని ప్రస్తావించడం మానేసి.. రేవంత్ చేసిన వ్యాఖ్యలకే ప్రాధాన్యం ఇవ్వడం మొదలు పెట్టింది. మొదట్లో చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత అతడేమైనా సరిహద్దులో యుద్ధం చేసిన సైనికుడా? అని వ్యాఖ్యానించడంతో అల్లు అర్జున్ అరెస్టు వెనుక ఎవరు ఉన్నారో తెలిసిపోయింది. వాస్తవానికి రేవంత్ రెడ్డి ఇటీవల నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత విషయంలో కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కానీ అల్లు అర్జున్ విషయంలో మాత్రం మొహమాటం లేకుండా చెప్పేశారు. ఓ ఆంగ్ల న్యూస్ ఛానల్ చేసిన ఇంటర్వ్యూలోనూ రేవంత్ దూకుడుగానే మాట్లాడారు. అల్లు అర్జున్ అరెస్టుపై మొహమాటం లేకుండా స్పందించారు. ఏమైనా ఇండియా, పాకిస్తాన్ బోర్డర్ లో నిల్చొని యుద్ధం చేశాడా?, అతను కేవలం ఒక సినిమా హీరో. ఈ దేశం లో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ లాంటి సూపర్ స్టార్స్ అరెస్ట్ అవ్వలేదా?, పుష్ప 2 చిత్రానికి నిర్మాతలు కోరిన వెంటనే మేము బెనిఫిట్ షోస్ కి అనుమతిని ఇచ్చాము. సరైన ప్రోటోకాల్స్ లేకుండా ఆయన థియేటర్ కి వచ్చాడు. కారెక్కి నమస్కారం చేస్తూ ర్యాలీ కూడా చేసాడు. అలా చేయడం వల్లనే అక్కడ పరిస్థితులు అదుపు తప్పాయి. అతని కారణంగా ఒక మహిళ చనిపోయింది. ఒక పసి బిడ్డ చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. దీనిని మేము తేలికగా వదిలేయాలా?, దీనిపై మేము కేసు పెట్టి చర్యలు తీసుకోకపోయితే , జనాలు పెట్టలేదని మమ్మల్ని అడగరా?, తప్పు ఎవరు చేసినా తప్పే చట్టానికి ఎవ్వరూ అతీతులు కారు' అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.'అల్లు అర్జున్ సైలెంట్ గా వచ్చి సినిమా చూసి వెళ్లిపోకుండా, కారు ఎక్కి చాలా హంగామా సృష్టించాడు. జనాలు ఎక్కువ ఉన్న చోట ఒక సెలబ్రిటీ వస్తే ఎలా ఉంటుందో అతనికి ఆ మాత్రం తెలియదా?, పోలీసులు వద్దని చెప్తున్నా కూడా లెక్క చేయకుండా ప్రోటోకాల్స్ ని ధిక్కరిస్తే ఏమి చెయ్యాలో మీరే చెప్పండి. అతనికి స్పెషల్ షో చూడాలని అనిపిస్తే ఇంట్లో హోమ్ థియేటర్ ఉంది , లక్షణంగా చూసుకోవచ్చు కదా, ఇలా లేనిపోని హంగామా సృష్టించడం ఎందుకు' అంటూ ఆయన సూటి ప్రశ్నలు వేసాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యింది. అల్లు అర్జున్ తీరుని తప్పు పెట్టేవాళ్ళు కొందరుంటే, మరి కొందరు మాత్రం ఆయనని సమర్థిస్తున్నారు. " ఒక సినీ నటుడు తన సినిమాను ఇంట్లో చూసుకోవచ్చు. లేకుంటే హోమ్ థియేటర్లో చూసుకోవచ్చు. అంతేగాని అంతమంది జనం వచ్చినచోటకు కార్లో చేయి ఊపుతూ రావడం వల్ల జనం భారీగా వచ్చారు. ఆ సమయంలో



వారందరినీ కంట్రోల్ చేయడం పోలీసుల వల్ల కాలేదు. అందువల్లే తొక్కిసలాట జరిగింది. ఫలితంగా ఓ భర్త తన భార్యను కోల్పోవాల్సి వచ్చింది. తన కుమారుడిని కాపాడుకునేందుకు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఇంతకంటే దారుణం ఏముంటుందని" రేవంత్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి కి సహజంగానే దూకుడు ఉంటుంది. ఆ దూకుడు వల్లే ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. నాటి అధికార భారత రాష్ట్ర సమితిని ఎక్కడికక్కడ ఎండగట్టారు. 2018 ఎన్నికల్లో కొడంగల్ అసెంబ్లీ స్థానంలో ఆయనను కావాలని ఓడించినప్పటికీ.. మల్కాజ్ గిరి స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత పిసిసి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీలో జవ సత్వాలు నింపారు. ఏకంగా అధికారంలోకి తీసుకొచ్చారు.. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి.. ఏడాది పాటు తన పరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి తన దూకుడు తగ్గించుకోవడం లేదు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని విషయాలలోనూ సానుకూల ధోరణి కంటే మరింత దూకుడు తనాన్ని ప్రదర్శిస్తున్నారు . దీనిని కొంతమంది వ్యతిరేకిస్తున్నప్పటికీ.. రేవంత్ తన ధోరణి మార్చుకోవడం లేదు. పైగా సై అన్నట్టుగా పోటీకి సంకేతాలు ఇస్తున్నారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్ విషయంలోనూ రేవంత్ కాస్త నెమ్మదిగా ఉన్నప్పటికీ.. అల్లు అర్జున్ విషయంలో మాత్రం తగ్గేదే లేదు అన్నట్టుగా దూకుడు తత్వాన్ని కొనసాగించారు. రేవంత్ వ్యవహార శైలిని భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా తప్పు పడుతుండగా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం గట్టిగానే సమాధానం ఇస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి రెండు పార్టీల సోషల్ మీడియా విభాగాల మధ్య ఏకంగా యుద్ధమే జరుగుతున్నది.

లాయర్ ఫీజు గంటకు 5 లక్షలు

రిన వేళ.. ఆయనకు బెయిల్ మంజూరు చేసేందుకు వాదనలు వినిపించిన లాయర్ ఎవరు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదించిన లాయర్ సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి గురించి ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అసలు ఈ లాయర్ నిరంజన్ రెడ్డి ఎవరు. ఆయన ఇంతకుముందు ఎలాంటి కేసులు వాదించారు. ఆయన గంటకు ఎంత ఫీజు వసూలు చేస్తారు. లాయర్ వృత్తి మాత్రమే కాకుండా ఆయన ఇంకా ఏమేం చేస్తారు అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్, ఆ వెంటనే మధ్యంతర బెయిల్ మంజూరు కావడం.. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. అల్లు అర్జున్ అరెస్ట్ సరికాదంటూ సినీ, ఇతర రంగాల ప్రముఖులు ప్రకటనలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్‌కు బెయిల్ రావడం వెనుక లాయర్ సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి పాత్ర ఎంతో ఉంది. బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ "రయీస్" సినిమా ప్రమోషన్లలో భాగంగా జరిగిన తొక్కిసలాట ఘటనను గుర్తు చేసిన లాయర్ నిరంజన్ రెడ్డి.. అల్లు అర్జున్‌కు కోర్టు బెయిల్ ఇవ్వడంలో కీలక వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలోనే అసలు ఈ సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి ఎవరు అనేది ఇప్పుడు చర్చ జరుగుతోంది. సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి లాయర్ మాత్రమే కాదు. ఆయన ప్రస్తుతం వైసీపీ తరఫున రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నారు. 2022లో సిర్గాపూర్ నిరంజన్ రెడ్డిని వైసీపీ రాజ్యసభకు నామినేట్ చేసింది. ఇదే కాకుండా ఆయన సినిమా ప్రొడ్యూసర్‌గా కూడా చేశారు. ఇప్పటివరకు ఆయన పలు సినిమాలకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. అందులో మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆచార్య సినిమా కూడా ఉండటం గమనార్హం. మిగితావి క్షణం, ఘాజీ, వైల్డ్ డాగ్ సినిమాలు ఉన్నాయి. 2011లో వచ్చిన గగనం సినిమాతో ఆయన సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని నిర్మల్. ఆయన తండ్రి విద్యాసాగర్ రెడ్డి కూడా ప్రముఖ లాయర్. నిరంజన్ రెడ్డి నిజామాబాద్‌తోపాటు హైదరాబాద్‌లోనూ విద్యాభ్యాసం చేశారు. 1992లో లా డిగ్రీ పూర్తి చేసిన నిరంజన్ రెడ్డి.. మహారాష్ట్ర పుణెలోని ప్రతిష్టాత్మక సింబయాసిస్ లా స్కూల్‌లోనూ చదువుకున్నారు. ఓవైపు లాయర్‌గా పలు కేసులు వాదిస్తూనే.. అటు ప్రొడ్యూసర్‌గా, ఇటు రాజకీయ నాయకుడిగా ఉన్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు నిరంజన్ రెడ్డి లాయర్‌గా వసూలు చేసే ఫీజు గురించి కూడా తీవ్రంగా చర్చ జరుగుతోంది. తాజాగా ఆయన అల్లు అర్జున్‌కు బెయిల్ ఇప్పించడంతో నిరంజన్ రెడ్డి పేరు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మారుమోగిపోతోంది. సీనియర్ లాయర్ అయిన సిర్గాపూర్ నిరంజన్ రెడ్డి.. గంటకు రూ.5 లక్షలు వసూలు చేస్తారనే వార్తలు ఇప్పుడు చక్కర్లు కొడుతున్నాయి.

అంతేకాకుండా పలు ముఖ్యమైన హై ప్రొఫైల్ కేసుల్లో వాదనలు వినిపించిన అనుభవం సిర్గాపూర్ నిరంజన్ రెడ్డికి ఉండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే, అల్లు అర్జున్ ఫ్రెండ్ శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి.. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు సిర్గాపూర్ నిరంజన్ రెడ్డిని తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.. తనకు ఉన్న పొలిటికల్ పరిచయాలతో తన పార్టీకి చెందిన నిరంజన్ రెడ్డికి కేసు అప్పగించినట్లు సమాచారం. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి మద్దతుగా అల్లు అర్జున్ అప్పట్లో ప్రచారం నిర్వహించారు.

# రీజనల్ రింగ్ రోడ్డుకు మహర్దశ

హైదరాబాద్, డిసెంబర్ 14, తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్ అని ప్రభుత్వ పెద్దలు వెల్లడిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరం నుంచి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ భాగాలుగా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తయింది. తెలంగాణ మణిహారంగా చేపడుతున్న రీజినల్ రింగు రోడ్డుపై కీలక అప్డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రాష్ట్రానికి సంబంధించి పలు జాతీయ రహదారులు, ఇతర రహదారుల వివరాలను తెలియజేసి సత్వరం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. 2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161 ౦౦ జాతీయ రహదారిగా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. మిగిలినవి కూడా పూర్తి చేస్తామమని త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు ఆర్థిక పరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. అందుకు గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. ఇక దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్ నగరంతో అనుసంధానించే ఔఊ-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని చెప్పారు. ఆ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, అందుకు 2024-25 బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఏపీలోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదగిరి గుట్ట దేవాలయం, నల్గొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో.. ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలన్నారు. నల్గొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్ పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారిని కలిసిన వారిలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పలువురు ఎంపీలు ఉన్నారు.

## ఆ ఇద్దరికి నో ఎంట్రీ బోర్డు

మహబూబ్ నగర్, డిసెంబర్ 14,పదేళ్లపాటు ఏకచత్రాధిపత్యంగా పాలించిన బీఆర్ఎస్‌కి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఓటర్లు కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఆ పార్టీ కేవలం రెండు సీట్లకే పరిమితం అయ్యింది. కేవలం గద్వాల, ఆలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే గులాబీ జెండా ఎగిరి జిల్లాలో పరువు దక్కించుకుంది. గద్వాల నుండి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ నుంచి అనూహ్యంగా బరిలో నిలిచిన విజయుడు విజయం సాధించారు. అయితే గెలిచిన తర్వాత గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో జిల్లా బీఆర్ఎస్‌లో ఒకే ఒక్కడుగా విజయుడు మిగిలిపోయారు. ఇక ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిచిన చల్ల వెంకట్రామిరెడ్డి సైతం బీఆర్ఎస్లోనే ఉండిపోయాడు. మిగిలిపోయిన ఈ ఇద్దరు కూడా ముహూర్తం చూసుకుని కాంగ్రెస్‌లోకి మారుతారన్న ప్రచారం జరిగింది. ముహూర్తం కుదరలేదో? మరే ఇతర కారణాలో తెలియదు కానీ వారి పార్టీ మార్పు వ్యవహారం అక్కడితో ఆగిపోయిందిగడచిన అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సంపత్ కుమార్‌కు ఓటమి తప్పలేదు. తన అనుచరుడైన విజయుడుని అనూహ్యంగా బరిలో ఉంచి సంపత్ కుమార్ ఓటమికి కారణమయ్యారు చల్ల వెంకట్రామిరెడ్డి. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన గెలిపించుకున్న అభ్యర్థి డమ్మీగా ఉండిపోవాల్సి వస్తుందంట. తాను ఎమ్మెల్సీగా ఉండి తన అనుచరుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో తమకు సరైన గుర్తింపు లేదని వెంకటరామిరెడ్డి మధనపడుతున్నారంటఆలంపూర్ ఎన్నికలలో పోటీ చేసి ఓటమిపాలైన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తన ఓటమికి ప్రధాన బాధ్యుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రా మిరెడ్డి అని ఆగ్రహంతో ఉన్నారంట.. అందుకే వారిద్దరినీ కాంగ్రెస్‌లో చేర్చుకోకుండా అడ్డం పడుతున్నారంట. ఈ క్రమంలో నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరాత్ర వ్యవహారాలకు సంబంధించి సంపత్‌కుమార్ పెత్తనమే నడుస్తుంది. నియోజకవర్గం యాంత్రాంగం మొత్తం సంపత్‌కుమారే ఎమ్మెల్యే అన్నట్లు వ్యవహరిస్తుంది. అయినప్పటికీ ఏదో రకంగా కాంగ్రెస్‌లో చేరడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు తమ పార్టీకి ఎమ్మెల్యే లేడు అన్న లోటు తెలియకుండా అధకారిక కార్యక్రమాలలో పాల్గొంటుండగా.. బీఆర్ఎస్ శ్రేణులు తమ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ.. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఆ క్రమంలో కొంతకాలంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మౌనంగా ఉండి పోవడంతో నియోజకవర్గ ప్రజలు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదలా ఉంటే ఇద్దరిలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్లో చేరిపోగా మిగిలిన ఎమ్మెల్యే విజయుడికి అవకాశం లేకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ డోర్లు తెరుచుకోకపోవడంతో ఎమ్మెల్యే విజయుడు తప్పని పరిస్థితులలో బీఆర్ఎస్‌లో చురుగ్గా వ్యవహరించాలని చూస్తున్న కేడర్ సహకరించడం లేదంట.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాత్రం ఇప్పటికీ నియోజకవర్గం వైపు తొంగి చూడడం లేదు. ఎన్నికలలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలయ్యే పరిస్థితి లేకపోవడంతో.. స్థానిక సంస్థల ఎన్నికలలో అలంపూర్ నియోజకవర్గంలో గులాబీ పార్టీకి ప్రతికూల ఫలితాలు తప్పవన్న ప్రచారం సాగుతోంది

# ఇందిరమ్మ ఇంటి సర్వేలో 35 ప్రశ్నలు

నల్గోండ, డిసెంబర్ 14, ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ అమలు కోసం 'యాప్' అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ప్రతి అంశాన్ని యాప్ లో నమోదు చేస్తున్నారు. అన్ని కోణాల్లో పరిశీలించి? లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవలే ప్రత్యేక మొబైల్ యాప్ ను తీసుకొచ్చింది. అన్ని జిల్లాల్లోనూ యాప్ ద్వారా అధికారులు వివరాలను సేకరిస్తున్నారు.ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి? వివరాలను సేకరిస్తున్నారు. యాప్ లో నమోదు చేసే వివరాల ఆధారంగా? దరఖాస్తుదారుడు అర్హులా? కాదా? అనేది వెల్లడవుతుంది.గతంలో ఏదైనా గృహ పథకంలో లబ్ధి పొందారా?, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం ఎలా ఉంది వంటి వివరాలను యాప్ లో సేకరిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి భూమి అందుబాటులో ఉందా? లేదా?, స్థలం లబ్దిదారుడి పేరు మీద ఉందా? కుటుంబ సభ్యుల పేరు మీద ఉందా?, ఇంట్లో వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుత గ్రామం/పట్టణంలో ఎన్నేళ్లుగా నివసిస్తున్నారు వంటి వాటిపై ఆరా తీస్తున్నారు. లబ్దిదారులు వికలాంగులు/అనాథలు/ ఒంటరి మహిళలు/వితంతువులు/ ట్రాన్స్ జెండర్లు, పారిశుధ్య కార్మికులు ఉంటే ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. వీరిని కూడా యాప్ ద్వారానే గుర్తిస్తారు, అన్ని కలిపి 30 – 35 ప్రశ్నలు ఉంటాయి. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు ఆయా వివరాలను యాప్లో నమోదు చేస్తున్నారు.మొదటి విడతలో సొంత స్థలం ఉన్న నిరు పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలి సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లను కేటాయిస్తారు. మొత్తంగా 4.5 లక్షల ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులను విడుదల చేస్తారు. ఈ నిధులను ధపాలు వారీగా ఇస్తారు.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కూసుమంచిలో మాట్లాడిన ఆయన? పేదవారు కన్న కల ఇందిరమ్మ ఇల్లు అని చెప్పుకొచ్చారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ అధికారులు వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం అభ్యర్థించారని తెలిపారు. ఎవరైతే సొంత స్థలంలో ఉంటారో వారి ఇంటి ఫోటో తీసి యాప్ లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తామన్న ఆయన? రాష్ట్ర వ్యాప్తంగా 580 మోడల్ హౌజ్ లను నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. సంక్రాంతి నాటికి కూసుమంచి లో మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తి అవుతుందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం లో కాంట్రాక్టర్లకు ఇళ్లు ఇస్తే కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఎవరు ఇళ్లు వారే నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలన లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారని వివరించారు. ప్రజాపాలన లో దరఖాస్తు చేయని వారు స్పెషల్ కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసిన వారి కుటుంబ సభ్యులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.ఇందిరమ్మ ప్రభుత్వం లో కండీషన్ లు పెట్టి ఇళ్లు ఇవ్వకుండా తప్పించుకునే ప్రభుత్వం కాదని మంత్రి స్పష్టం చేశారు. పేదవారికి భారం కాకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. గ్రామాలకు సర్వేకు వచ్చే అధికారులు ఇందిరమ్మ కమిటీలను కలుపుకుని పోవాలని పిలుపునిచ్చారు. పేదవారి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. దరఖాస్తుదారుల వివరాలను ఎంట్రీ చేసి? లబ్ధిదారులను గుర్తిస్తారు. యాప్ అందుబాటులోకి రావటంతో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ప్రక్రియ వేగవంతం కానుంది.ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఆయా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వేయర్లు యాప్ లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ మొదలైంది. దరఖాస్తుదారుడి అన్ని వివరాలను సేకరిస్తారు. గతంలో ఏదైనా ఇంటి స్కీమ్ లో లబ్ధి పొందారా..? ఎలాంటి వాహనాలు ఉన్నాయి..? స్థలం ఎవరి పేరుపై ఉంది..? కుటుంబంలో ఉద్యోగస్తులు ఎవరైనా ఉన్నారా..? ఇన్ కమ్ ట్యాక్స్ చెల్లింపుతో పాటు ఇతర వివరాలను తీసుకుంటారు. దరఖాస్తుదారుడు ఇచ్చే సమాచాన్ని యాప్ లో నమోదు చేసిన తర్వాత అన్ని కోణాల్లో క్రోడీకరిస్తారు. ఇందులో ఏఐ టెక్నాలజీ కీలకంగా పని చేయనుంది. అన్నింటిని పరిశీలించిన తర్వాతే? అసలైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తారు.

# సంగారెడ్డి నుంచే యుద్ధ ట్యాంకర్లు...

మెదక్, డిసెంబర్ 14, సరిహద్దుల్లో బాంబుల గర్జనలు చేసే యుద్ధ ట్యాంకర్లు.. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువులో ప్రత్యక్షమయ్యాయి. భారీ ఆకారంతో యుద్ధ మైదానాల్లో పరుగులు తీసే ఈ ట్యాంకర్లు చెరువులో పడవల ప్రయాణిస్తూ.. స్థానిక ప్రజల ఆకట్టుకున్నాయి. కొండలు, గుట్టలు, పర్వతాలను అధిరోహించే ఈ యుద్ధ ట్యాంకర్లు ఎందుకు మల్కాపూర్ చెరువులో దిగాయి. ఇక్కడి నీటిలో ఎందుకు చక్కర్లు కొట్టాయో తెలుసుకుందాం..సంగారెడ్డి జిల్లాలోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో యుద్ధ ట్యాంకర్లను తయారు చేస్తున్నారు. ఇక్కడ నుంచే వీటిని భారత సైన్యానికి అందిస్తుంటారు. ఇవి దేశం నలుమూలల భారత సైనిక దళాల్లో చేరి విధులు నిర్వహిసుంటాయి. అలాంటి ట్యాంకర్లు కఠినమైన మైదానంలోనే కాకుండా.. నీటిలోనూ ప్రయాణం సాగించేందుకు వీలుగా రూపొందించారు. యుద్ధక్షేత్రాల్లో ఎక్కడైనా కాలువలు, నదులు ఎదురైతే ఆ అడ్డంకులను సులువుగా అధిగమించేలా వీటిని డిజైన్ చేశారు.ఈ కారణంగానే యుద్ధ ట్యాంకర్లను మల్కాపూర్ లోని మైదాన ప్రాంతాలతో పాటు ఇక్కడి చెరువులోనూ ట్రైయల్ రన్ నిర్వహించారు. నీటిలో ప్రయాణించేటప్పుడు ఇవి ఏ తీరుగా పనిచేస్తున్నాయో శాస్త్రవేత్తల బృందం పరీక్షించింది. ఈ సమయంలో యుద్ధ ట్యాంకర్లు, వాటి విన్యాసాలను వీక్షించేందుకు స్థానిక ప్రజలు గుమ్మిగుడారు. వీటి విన్యాసాలు ప్రయాణాన్ని చూసి స్థానికులు ఆశ్చర్యపడ్డారు.ఎద్దుమైలాపూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారైన ఈ యుద్ధ ట్యాంకర్.. ఒక్కొక్కటి 14.5 టన్నుల బరువుతో రూపొందించారు. ఈ ట్యాంకర్ పై ఒకేసారి పదిమంది ప్రయాణం చేసే అవకాశం ఉంది. నేల మీదే కాకుండా నీటిలో ప్రయాణించే సమయంలోనూ ఈ ట్యాంకర్ పై పదిమంది ప్రయాణించవచ్చని చెబుతున్నారు. ట్రయల్ రన్ సమయంలోను ట్యాంకర్ పై పదిమంది కూర్చుని చెరువులో ప్రయాణించారు.ఇప్పటికే పెద్ద ఎత్తున ఈ తరహా యుద్ధ ట్యాంకుల్ని ఉత్పత్తి చేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ.. దాదాపు 3500 ట్యాంకర్లను భారత సైన్యానికి అందించింది. మరిన్ని ట్యాంకర్లను రూపొందిస్తూ సైనిక దళాలను పటిష్టం చేయడంలో విరామం లేకుండా కృషి చేస్తోంది ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ. ఇక్కడ తయారవుతున్న యుద్ధ ట్యాంకర్లను అనేక పరిస్థితుల్లో, వివిధ ప్రాంతాల్లో పరీక్షిస్తూ.. వాటి సామర్థ్యాలను పరిశీలిస్తుంటారు. వాటిలో ఏమైనా లోటుపాట్లుంటే.. సరిచేసి అప్ గ్రేట్ చేస్తుంటారు. అందుకే ఇక్కడ నిర్వహించిన ట్రయల్ రన్ లకు ప్రత్యేకత ఉంటుంది. పైగా.. ఈ ట్యాంకర్లు యుద్ధ క్షేత్రాల్లో కీలక భూమిక పోషిస్తుంటాయి కాబట్టి.. ఇలాంటి వెహికిల్స్ ఎంత సమర్ధవంతంగా, అత్యాధునికంగా ఉంటే మన సైనిక దళాలు అంత పటిష్టంగా ఉంటాయి.ప్రస్తుతం మల్కాపూర్ చెరువులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ట్యాంకర్లను.. ఇన్ఫాంట్రీ వెహికల్స్ గా పిలుస్తారని ఆర్టినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు వెల్లడించారు. వీటిని యుద్ధ క్షేత్రాల్లో ప్రత్యర్థుల పోస్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత సైనికులను, ఇతర సామాగ్రిని వేగంగా తరలించేందుకు వినియోగిస్తారని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఫ్యాక్టరీ నుంచి వేలాది ట్యాంకర్లను, వివిధ వేరియంట్లల్లో తయారు చేస్తుండగా.. ప్రస్తుతం పరీక్షలు జరుపుకున్న వాటిలో 7 రకాలున్నట్లు పేర్కొన్నారు. వాటిలోఒకదాన్ని ప్రస్తుత ట్రయల్ రన్ లో వినియోగించినట్లు తెలిపారు.

# గోవాకు తగ్గుతున్న పర్యాటకం



పానాజీ, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్) భారత్ ఎన్నో అందమైన ప్రదేశాలకు, సహజ సిద్ధమైన అందాలకు నిలయం. ప్రకృతి ప్రేమికులను ఆకర్షించే దట్టమైన అడవులు ఉన్నాయి. చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రాలకు అయితే కొదువ లేదు. ఇక బీచ్‌లు దేశంలో అనేకం ఉన్నాయి. అయితే గోవా బీచ్‌లు ఇక్కడ చాలా ప్రత్యేకం. ఇక్కడికి దేశంతోపాటు విదేశాల నుంచి కూడా టూరిస్టులు వస్తుంటారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి టూరిసమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా టూరిజం అభివృద్ధికి, పర్యాటకుల రక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో విదేశీ పర్యాటకులను కూడా గోవా ఆకర్షిస్తోంది. ఏటా లక్షల మంది ఇక్కడి బీచ్‌లకు వస్తుంటారు. అయితే ఇటీవల గోవాకు వచ్చే పర్యాటకులు తగ్గుతున్నారు. దేశీయ పర్యాటకులతోపాటు విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గుతోంది.గోవా రాష్ట్రానికి వచ్చే పర్యాటకులు ఐదేళ్లుగా తగ్గిపోతున్నారు. 2019లో గోవాకు రికార్డుస్థాయిలో 85 లక్ష మంది వచ్చారు. 2023 నాటికి ఆ సంఖ్య 15 లక్షలకు పడిపోయింది. ఈ లెక్క ప్రకారం 75 శాతానికిపైగా టూరిస్టులు తగ్గిపోయారు. కరోనా కారణంగా 2020లో కేవలం 2 లక్షల మంది, 2021లో 5 లక్షల మంది, 2022లో 12 లక్షల మంది మాత్రమే వచ్చారు. రష్యా, బ్రిటన్ నుంచి ఎక్కువగా టూరిస్టులు వచ్చేవారు. వారంతా ఇప్పుడు శ్రీలంకకు వెళ్తున్నారు.ఇక భారతీయ టూరిస్టులు ఎక్కువగా థాయ్‌లాండ్, మలేషియా వెళ్తున్నారు. దేశంలోని పర్యాటక ప్రదేశాలను చూడడం కన్నా ఫారిన్ వెళ్లడం మేలని భావిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. విమాన చార్జీలు తక్కువగా ఉండడం, వివిధ సంస్థలు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తుండడం, గోవా వెళ్తే అయ్యే ఖర్చులతో పోలిస్తే.. విదేశీలకు వెళ్తే అయ్యే ఖర్చు దాదాపు సమానంగా ఉండడంతో చాలా మంది, ముఖ్యంగా వయుత ఫారిన్ ట్రిప్‌కే మొగ్గురూపుతున్నారు.ఇక ఏటా గోవాకు వచ్చే ఫారిన్ టూరిస్టులు కూడా తగ్గిపోతున్నారు. థాయ్‌లాండ్, శ్రీలంగ, మలేషియా, మాల్దీవులు టూరిస్టులను ఆకట్టుకుంటున్నాయి. ఇక కొన్ని దేశాల్లో ఖర్చు తక్కువగా ఉండడం కూడా విదేశాలకు వెళ్లేందుకు కారణంగా పరిశీలకులు చెబుతున్నారు.ఇక గోవాలో టాక్సీ మాఫియా విదేశీ టూరిస్టులను ఇబ్బంది పెడుతోంది. గతంలోనూ వెలుగు చూశాయి.వాటికారణంగా టూరిజం ఇమేజ్ దెబ్బతింటోంది. ఇక గోవాలో అసౌకర్యాలు, గోవా టూరిస్టు డెస్టినేషన్‌గా ఎంచుకవడానికి ఫారిన్ టూరిస్టులు వెనుకాడుతున్నారు. ఐదేళ్లుగా పర్యాటకుల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇక థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేషియాతో పోలిస్తే మన గోవాలో సౌకర్యాలు తక్కువగా ఉన్నాయ. దీంతో తెలుగు టూరిస్టులు కూడా గోవాకు వెళ్లకుండా ఫారిన్ ట్రిప్ వేస్తున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర టూరిస్టుల భద్రత విషయంలో గోవాకన్నా చురుగ్గా ఉన్నాయి..

# వివాదాల మోహన్ బాబు



హైదరాబాద్, డిసెంబర్ 14, మంచు మోహన్‌బాబు.. 500 సినిమాలకు పైగా నటించి.. 50 సినిమాల వరకూ నిర్మించి.. ఇంట్లో ముగ్గురు బిడ్డలను నటులుగా ఇండస్ట్రీకి అందించి.. టాలీవుడ్ మెయిన్ పిల్లర్లలో ఒకడిగా నిలిచిన వాడు. నటన విషయంలో మోహన్ బాబు టాలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ది గ్రేటెస్ట్ అనొచ్చు. హీరోయిజమైనా, విలనిజమైనా, పౌరుషమైనా... పౌరాణికమైనా.. చివరకు కామెడీ అయినా సరే.. మోహన్‌బాబుకు తిరుగులేదు. అద్భుతమైన పాత్రలతో అలరించడమే కాదు.. అంతకంటే మంచి చిత్రాలను ప్రొడ్యూసర్‌గానూ అందించారు. 75ఏళ్ల పై వయసులో ఇప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఓ పెద్దదిక్కుగా ఉన్నారు. ఇదంతా మోహన్‌బాబుకు ఓ సైడు... ఇంకో వైపు చూస్తే.. ఆయన ప్రొఫెషనల్.. పర్సనల్ లైఫ్ లో బోలెడు వివాదాలున్నాయి. ఇప్పుడు ఇంట్లో గొడవ రచ్చకెక్కింది కానీ.. అంతకు ముందు నుంచే ఆయన చుట్టూ చాలా గొడవలున్నాయి. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఏం జరిగిందో తెలీదు అయితే తిరుపతి రంగంపేట దగ్గర శ్రీ విద్యానికేతన్ పెట్టిన దగ్గర నుంచీ చాలా విషయాలు అందుబాటులో ఉన్నాయి.తిరుపతి రంగంపేట దగ్గర పాతికేళ్ల కిందటే మోహన్‌బాబు విద్యాసంస్థ ఏర్పాటు చేశారు. ఇప్పుడది వందల ఎకరాల్లో యూనివర్సిటీగా రూపుదిద్దుకుంది. ఆ విద్యాసంస్థ దారి విషయంలో 1999లో ఊరి వాళ్లతో గొడవైంది. దానిని చిత్రీకరించడానికి వెళ్లిన మీడియా ప్రతినిధిపై దాడి చేసి కెమెరా ధ్వంసం చేశారు. ఆర్థిక పరమైన లావాదేవీల విషయంలో అప్పటి తిరుపతి టీడీపీ నేత, మాజీ మునిసిపల్ ఛైర్మన్ కందాటి శంకర్‌రెడ్డిపై మోహన్‌బాబు అనుచరులు దాడి చేశారు. అప్పట్లో నటుడు శ్రీహరి కూడా ఆ గొడవలో ఉన్నట్లు బయటకు వచ్చింది. ఆయన మోహన్‌బాబుతో శ్రీరాములయ్య సినిమాలో నటిస్తున్నారు. శ్రీహరితో స్నేహం ఉన్న మోహన్ బాబు ఆయన్ను తీసుకెళ్లారు. రివాల్వర్‌తో శంకర్‌రెడ్డిని బెదిరించారని ప్రచారం జరిగింది. మోహన్‌బాబుకు కోపం ఎక్కువ. ఈ విషయం ఆయన కూడా చాలా సందర్భాల్లో అంగీకరించారు. తనది ధర్మాగ్రహం అని.. అన్యాయం జరుగుతుంటే సహించలేనని ప్రశ్నిస్తానని పలు సందర్భాల్లో చెప్పారు. అయితే ఈ కోపం కాస్త తీవ్రమై తన సినిమాల్లో నటులపై దురుసుగా ప్రవర్తించడం, చేయు చేసుకోవడం వరకూ వెళ్లేదని ఇండస్ట్రీ వాళ్లు అంటుంటారు. పెదరాయుడు సినిమా షూటింగ్ సమయంలో సీనియర్ నటి జయంతిపై కోప్పడటమే కాకుండా చేయు చేసుకున్నారని బాగా ప్రచారం జరిగింది. అది పెద్ద గొడవగా మారడంతో అప్పట్లో దాసరి నారాయణరావు ఆ తగువును తీర్చారని చెబుతారు. ఆ తర్వాత విష్ణు బాబుతో తీసిన మొదటి సినిమా విష్ణు లో హీరోయిన్ శిల్పా శివానంద్ విషయంలో కూడా ఆయన ఇలాగే ప్రవర్తించారు. ఆమెపై కూడా చేయి చేసుకున్నారా లేదా అన్నది క్లారిటీ లేదు కానీ ఆమెతో అయితే గట్టిగానే గొడవ అయిన విషయం మాత్రం నిజం. మోహన్‌బాబు గొడవలన్నింటిలోకి పెద్దది, ముఖ్యమైంది.. తెలుగు సినిమా వజ్రోత్సవాల సమయంలో జరిగిందే. చిరంజీవిపై పరోక్షంగా చేసిన వ్యాఖ్యల వల్ల జరిగిన రగడ.. అంతా ఇంతా కాదు. తెలుగు సినిమా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పట్లో సినిమా పెద్దలు చిరంజీవికి లెజండరీ అవార్డు ఇద్దాం అని ప్రతిపాదించారు. దీనిని మోహన్‌బాబు అంత పెద్ద వేదికపైనే 'ఎవరు లెజండరీ.. ఎవరు సెలబ్రిటీ' అని ప్రశ్నించారు. రాజ్యసభకు ఎంపికై.. పద్మశ్రీ తీసుకున్న తనకు అర్హత లేదా అన్నారు. రాజ్యసభకు ఎంపికై.. పద్మశ్రీ తీసుకున్న తనకు అర్హత లేదా అన్నారు. ఆ వెంటనే చిరంజీవి సోదరుడు పవన్ కల్యాన్.. మోహన్‌బాబు ను ఉద్దేశించి.. "తమ్ముడూ మోహన్‌బాబు" అనడంతో వివాదం మరింత పెద్దదైంది. ఈ గొడవ ముదరడంతో చిరంజీవి తనకు ఆ అవార్డు వద్దని వారించి.. కుదిరితే తెలుగు సినిమా వందేళ్ల ఫంక్షన్లో తీసుకుంటా అన్నారు. మోహన్‌బాబు నటుడు మాత్రమే కాదు.. రాజకీయాల్లోనూ క్రియాశీలకంగానే ఉన్నారు. తెలుగుదేశం పార్టీతో సన్నిహితంగా ఉన్న ఆయన ఆ పార్టీ తరపున రాజ్యసభకు వెళ్లారు. ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న మోహన్‌బాబు ఆయన్ను పదవీచ్యుతుడిని చేసే సమయంలో చంద్రబాబు వెంట ఉన్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే చంద్రబాబుతో గొడవ అయింది. దీంతో ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత నుంచీ చంద్రబాబును వ్యతిరేకిస్తూ వచ్చిన మోహన్‌బాబుకు.. చంద్రబాబుతో వ్యాపార గొడవలు కూడా వచ్చాయి. హెరిటేజ్‌ను ప్రారంభించినప్పుడు మోహన్‌బాబు కూడా అందులో ఓ డైరెక్టర్. అందులో వాటాల విషయంలో చంద్రబాబుతో విభేదించారు. ఆ తర్వాత వైఎస్సార్‌కు, ఆయన కుమారుడు జగన్‌కు సన్నిహితంగా ఉన్న మోహన్‌బాబు 2014–19లో చంద్రబాబు పై గట్టిగానే మాట్లాడారు. వేలాది మంది విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి.. ఫీజు రీయింబర్స్మెంట్ చేయడం లేదంటూ.. తిరుపతి రోడ్డుపైన పడుకున్నారు. ఆ తర్వాత.. తర్వాత చంద్రబాబుతో కొద్దిగా సర్దుబాటు అయింది. మోహన్ బాబు ఫ్యామిలీలో చాలా కాలం హెయిర్ డ్రస్సర్ గా పనిచేసే నాగ శ్రీను అనే వ్యక్తితో గొడవ అయింది. ఆయనపై ఫ్యామిలీ దొంగతనం కేసు పెట్టగా.. ఆ వ్యక్తి తనను వేధించారని కులం పేరుతో దూషించారని ఆరోపణలు చేయడంతో పెద్ద గొడవే జరిగింది. ఇక ఆయన మాటల వల్ల జరిగిన రచ్చలు అనేకం. రంగంపేటలో మోహన్‌బాబు యూనివర్సిటీ ఎదురుగా ఉండే దుకాణాల విషయంలో చిన్న చిన్న గొడవలు చాలా జరిగాయి. ఈ దుకాణదారులను యూనివర్సిటీ వాళ్లు ఇబ్బంది పెడుతున్నారని మనోజ్ వాళ్లకు బహిరంగంగా మద్దతు ఇచ్చారు. అక్కడ నుంచే ఇంట్లో గొడవలు పెరుగుతూ వచ్చాయి. ఓ నటుడిగా తిరుగలేని స్టార్ అయిన మోహన్‌బాబు వ్యక్తిగా మాత్రం ట్రోలింగ్ స్టార్. ఆయన, ఆయన కుటుంబం చేసిన వ్యాఖ్యలు, చేష్టల వల్ల అనేక సార్లు వీళ్లు ట్రోలింగ్‌కు గురయ్యారు. తమ కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని పనిగట్టుకుని చేశారని మంచు విష్ణు అనేక సార్లు చెప్పిన దాంట్లో నిజం ఉండొచ్చేమో కానీ.. వీళు సోషల్ మీడియాలో పలుచన అయింది కూడా అంతే నిజం. మోహన్‌బాబు దురుసుతనంతో.. మంచువిష్ణు ఫన్నీ కామెంట్లతో.. మంచు లక్ష్మి తనదైన మేనరిజం, యాక్సెంట్‌తో ఫేమస్ అయ్యారు. వీళ్లంతా ఓ టైప్ అయితే మనోజ్ ఇంకో రకం. ఇంట్లో ఉన్న అందరిపైనా ట్రోలింగ్ రావడం వీళ్ల విషయంలోనే జరిగింది.

# సెకండ్ ఇన్నింగ్స్ కు రెడీ అవుతున్న రోజా..

చెన్నై, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్) తెలుగు రాజకీయాల్లో నగరి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్కే రోజా అంటే ఫైర్.. ఫైర్ అంటే రోజా అన్నట్లు వ్యవహరించారు. ప్రత్యర్థులపై ఆమె చేసే విమర్శలు అంత ఘాటుగా ఉంటాయి. ఏ అంశంలోనైనా ప్రత్యర్థుల్ని ఏకిపారేయడం రోజా స్టైల్. నగరి నుంచి వరుసగా రెండుసార్లు గెలిచిన రోజా ఆ నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గాలి భాను చేతిలో ఘోర ఓటమిని మూటగట్టుకున్నారు.మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో రోజా భర్త, సోదరుల పెత్తనం పెరిగిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తినా ఆమె పట్టించుకోలేదు. చంద్రబాబు, లోకేష్, పవన్ లపై మితిమీరిన విమర్శలు, సొంత పార్టీలో వ్యతిరేక కుంపటి, మంత్రి అయ్యాక హంగు ఆర్భాటం, విలాసవంతమైన జీవితం, విదేశీ ప్రయాణాలు.. ఇవే రోజాకు ప్రస్తుతం శాపాలుగా మారాయి. ఆ ప్రభావంతో గత ఎన్నికలలో సూమారు 45 వేల ఓట్లతో ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల తరువాత ఏపీఐసీసీ చైర్మన్ గా, మంత్రిగా రోజాల చేసిన అక్రమాలతో పాటు, నియోజకవర్గం జరిగినా అవినీతిపై విచారణ కోరుతూ పెద్ద ఎత్తున కూటమి నేతలు సిఐడి కు ఫిర్యాదు చేశారు.ఆ క్రమంలో ఆడుదాం ఆంధ్ర, నగరిలో భూ అక్రమాలు, టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాలకు సంబంధించి కోట్ల రూపాయల అవినీతిపై సీఐడీ లోతుగా విచారణ జరుపుతుందట. ఆ ప్రభావంతో ఎన్నికల తరువాత అప్పుడప్పుడు తిరుపతి జిల్లాలో తళుక్కుమన్న రోజా గత కొంత కాలంగా అసలు ఇటు వైపు చూడటమే మానేశారు. ఆమె చెన్నై, హైదరాబాదుల్లోనే ఎక్కువగా ఉంటున్నారు.సీఐడీ విచారణలతో రాజకీయంగా ఇబ్బందులు తప్పదని ఫిక్స్ అయిన అమె ఇప్పుడు రూట్ మార్చినట్లు టాక్ నడిస్తోంది.రోజా ఓడిపోయాక గతంలోలా పెద్దగా వాయిస్ వినిపించడం లేదు. అప్పుడప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎక్స్ వేదికగా మాత్రమే పోస్టులు పెడుతూ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ క్రమంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి సంబంధించి రోజా పెట్టిన ట్వీట్‌పై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఘాటుగా స్పందించారు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుంది మీ యవ్వారం. ముందు ఆ ప్యాలెస్‌కు.. మీ బెంజ్ కారుకు ఉన్న సంబంధం ఏంటో బయట పెట్టండని భాను నిలదీయడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.రోజా బెంజికారు ఎపిసోడ్ వైరల్‌గా మారడంతో .. లేనిపోని తలనొప్పులు ఎందుకని రోజా ట్వీట్ లు పెట్టడం కూడా తగ్గించేశారు. పార్టీ ఆదేశిస్తే తప్ప తనుకు తానుగా బయటకు వచ్చి స్పందించడం మానేశారు. ట్వీట్లు సైతం పార్టీ పంపితే పెడుతూ సైలెంట్ గా ఉంటున్నారంట. ఈమధ్య షర్మిల సైతం రోజా పెడుతున్న పోస్టులు అమెవీ కాదని వైసీసీ సోషల్ మీడియా చేస్తున్న పనే అని ఆరోపించారు.ఏదేమైనా మున్నుందు దూకుడుగా వెళితే ఇబ్బందులు అని తెలిసే రోజా మౌనంగా ఉంటున్నారనే టాక్ వైసీపీలో నడుస్తోంది. అందుకే పొలిటికల్ హీట్ నుండి తప్పించుకోవడానికి సినిమాల వైపు చూస్తున్నారట రోజా.. తాను క్యారెక్టర్ రోల్స్ చేయడానికి రెడీ అంటూ తన టీమ్ ద్వారా టాలీవుడ్‌లోని పలువురు దర్శకులకు, తమిళ సినిమా నిర్మాతలకు సంకేతాలు పంపిస్తున్నారంట. నిజానికి రాజకీయాల వల్ల సినిమాలకి గుడ్ బై చెప్పారు కానీ ఒకప్పుడు క్యారెక్టర్ రోల్స్‌తో టాలీవుడ్‌లో, టీవీ షోల్లో రోజా బిజీగానే ఉన్నారు.2013లో ఆమె టాలీవుడ్‌కి గుడ్‌బై చెప్పారు. అప్పటి నుండి ఫుల్ టైమ్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. కానీ బుల్లితెరపై జబర్దస్త్, ఎక్స్‌ట్రా జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి షోలు, పలు ఫెస్టివల్ ఈవెంట్స్‌లో మాత్రం పాల్గొంటూ వచ్చారు .. మంత్రి పదవి వచ్చిన తర్వాత బుల్లితెరకి కూడా బైబై చెప్పేశారు. అయితే ఇటీవల జబర్దస్త్ కాకుండా ఎదైనా షోలో అవకాశం ఇస్తే చేస్తానని ఆమె ప్రకటించారు. మొన్నీమధ్య కేసీఆర్ అనే సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కి గెస్ట్‌గా రావడం, పుష్ప సినిమాను అద్భుతంగా ఉందంటూ పొగడటం లాంటివి స్క్రీన్‌పై రీఎంట్రీ ఇవ్వడానికే అంటున్నారు.అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెకు అవకాశాలు ఎంత ఎవరకు వస్తాయో అనేది డౌటే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. డిప్యూటీ సిఎంగా పవన్ ఉండటం, తాజాగా నాగబాబుకు మంత్రి గా అవకాశం రావడంతో.. చిరంజీవి నుండి పవన్ వరకు అందరి పైన తీవ్రస్థాయి విమర్శలు చేసిన రోజాకు సినిమా ఇండస్ట్రీ నుంచి ఏ మేరకు మద్దతు లభిస్తుంది అన్నది అనుమానంగానే మారింది .. మరి టాలీవుడ్‌లో తిరిగి మేకప్ వేసుకోవాలనుకుంటున్న రోజా కోరిక తీరకపోతే.. ఆమె తమిళ ఇండస్ట్రీకి షిఫ్ట్ అయిపోతారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# సినిమా



## నరేష్‌కి 'రంగస్థలం'లాంటి సినిమా



హీరో అల్లరి నరేష్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకుడు. అమృత అయ్యర్ హీరోయిన్. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమా ఈనెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రాజేష్ దండా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. ఇది క్యారెక్టర్ డ్రివెన్ సినిమా. 1980లో జరిగే కథ. ఇది రియల్ లైఫ్ స్టోరీ కాదు. మా డైరెక్టర్‌ది తుని. అదే ఊర్లో బచ్చలమల్లి అనే ఒక వ్యక్తి ఉన్నారు. కేవలం ఆయన పేరుని మాత్రమే ఈ సినిమా కోసం తీసుకున్నాం. ఇది పూర్తిగా ఫిక్షనల్ స్టోరీ. రామ్ చరణ్‌కి 'రంగస్థలం' ఎలానో నరేష్‌కి 'బచ్చలమల్లి' అలాంటి సినిమా అవుతుంది. సినిమా అద్భుతంగా వచ్చింది. సినిమా చూసి ఇది నరేష్ 2.0 అని ఫీల్ అవుతారు. ఆయన నట విశ్వ రూపాన్ని చూస్తారు. లైఫ్‌లో తప్పులు చేయొచ్చు. కానీ సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే ఎలా ఉంటుందో ఇందులో చూపించాం. మూర?త్వం బోర్డర్ దాటేసిన క్యారెక్టర్‌ని నరేష్ చేశారు. సినిమాలో ఎమోషన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. డైరెక్టర్ సుబ్బు చాలా కసితో సినిమా చేశాడు. ఈ సినిమాలో విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ వన్ అఫ్ ది హైలెట్. పాటలు ఇప్పటికే జనాల్లోకి వెళ్ళాయి. సినిమా చూసిన తర్వాత ఇంకా బాగా కనెక్ట్ అవుతారు. డిఓపి రిచర్డ్ ఎం నాథన్, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మకడలి, ఫైట్ మాస్టర్ పృథ్వీ పనితనం ప్రధాన ఆకర్షణ అవుతుంది. ఇవన్ని సినిమాని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళాయి. సందీప్ కిషన్‌తో చేస్తున్న 'మజాకా' నాకు చాలా ఇష్టమైన సినిమా. అలాగే కిరణ్ అబ్బవరం సినిమా ఫిబ్రవరి నుంచి స్టార్ట్ అవుతుంది. ఒక పాన్ ఇండియా సబ్జెక్ట్ కుదిరింది. అలాగే నరేష్‌తో 'సామజవరగమణ' లాంటి కథతో సినిమా ఉంటుంది. వీటి గురించి త్వరలోనే చెబుతాను.

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు



జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైన సంగతి విదితమే. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని మోహన్‌బాబు అభ్యర్థించారు. దీనిని కోర్టు తిరస్కరించింది. తదుపరి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది. కాగా, మంచు ఫ్యామిలీ వివాదాల నేపథ్యంలో గత ఆదివారం నుంచి మూడ్రోజులపాటు హైడ్రామా నడిచిన సంగతి తెలిసిందే. మోహన్ బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. తనపై దాడి జరిగిందంటూ పోలీసులను మనోజ్ ఆశ్రయించగా, కుమారుడు మనోజ్ అతని భార్యతో తనకు హాని ఉందని రాచకొండ పోలీసులకు మోహన్ బాబు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో తండ్రికొడుకులపై కేసులు అయ్యా యి. అయితే మంచు ఫ్యామిలీ ఘర్షణల నేపథ్యంలో ప్రశ్నించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధిపై మోహన్ బాబు దాడికి పాల్పడ్డారు. దీంతో ఆ విలేకరి చెవి ఎముక మూడు చోట్ల విరిగింది. దీనికి సంబంధించిన వీడియో తెగ వైరల్‌గా మారింది. ఈ దాడిపై ఆ వార్తా సంస్థ యాజమాన్యం రాచకొండ పోలీసులను ఆశ్రయించింది. వారి ఫిర్యాదు మేరకు మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు అయ్యింది. అయితే విచారణకు రావాలంటూ ఆయనకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాగా, మూడ్రోజులపాటు జరిగిన తీవ్ర ఘర్షణలతో ఆయన అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. ఈ సమయంలోనే తనపై హత్యాయత్నం కేసు నమోదు కావడంపై హైకోర్టును ఆయన ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు. కాగా, శుక్రవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం మోహన్‌బాబు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలురించింది.

## సరికొత్త అనుభూతినిచ్చే 'సంబరాల ఏటిగట్టు'




హీరో సాయి దుర్గ తేజ్ తాజాగా నటిస్తున్న చిత్రానికి 'సంబరాల ఏటిగట్టు' అనే ఆసక్తికర టైటిల్‌ని మేకర్స్ ఖాయం చేశారు. 'హనుమాన్' వంటి సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. టైటిల్ రివీల్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న హీరో రామ్ చరణ్ 'కార్నేజ్' టీజర్‌ను లాంచ్ చేశారు. కార్నేజ్ వీడియో సాయి దుర్గ తేజ్ విధ్వంసక, ఇంటెన్స్ క్యారెక్టర్‌కు స్నీక్ పీక్ అందిస్తోంది. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ వచ్చే ఏడాది సెప్టెంబర్ 25న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళంలో విడుదల కానుంది. ఈ సంధ్భరంగా హీరో రామ్ చరణ్ మాట్లాడుతూ,'తేజ్ ప్రతి క్యారెక్టర్‌కి తపన పడతాడు. కష్టపడతాడు. అందరికీ ఒకటే మాట చెబుతున్నా. తేజు ఊచకోత ఎలా ఉంటుందో ఈ సినిమాతో చూడబోతున్నారు. అవుట్ స్టాండింగ్ విజువల్స్. రోహిత్‌కి ప్రత్యేకంగా థాంక్స్ చెప్తున్నాను. తను ఫస్ట్ సినిమా చేస్తున్నట్టుగా లేదు. చాలా అద్భుతంగా ఉంది. తేజ్ మీద ఇంత పెద్ద బడ్జెట్ పెడుతున్నందుకు నిర్మాతలు నిరంజన్, చైతన్యకి ఆల్ ది వెరీ బెస్ట్. ఈ సినిమాతో చాలా పెద్ద బ్లాక్ బస్టర్ కొట్టి మంచి న్యూస్ కూడా వినిపించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

## 'మర్దానీ 3'లో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా..



రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందిన బ్లాక్ బస్టర్ చిత్రం 'మర్దానీ'. ఈ సినిమా విడుదలై 10 ఏళ్లు అవుతుంది. 2014లో ఈ చిత్రం విడుదలైంది. 2019లో దీనికి సీక్వెల్‌ను రూపొందించారు. ఈ రెండు చిత్రాలు సూపర్ హిట్ చిత్రాలుగా బాక్సాఫీస్ దగ్గర రాణించాయి. మర్దానీ 2 రిలీజ్ యానివర్సరీ సందర్భంగా మర్దానీ 3కి సంబంధించిన మేకింగ్ వీడియోను యష్ రాజ్ ఫిలిమ్స్ విడుదల చేసింది. ఇందులో రాణి ముఖర్జీ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీ రాయ్ పాత్రలో నటించారు. ఈ సందర్భంగా రాణి ముఖర్జీ మాట్లాడుతూ "2025 ఏప్రిల్ నుంచి మర్దానీ3 చిత్రానికి సంబంధించిన షూటింగ్‌ను ప్రారంభించబోతున్నామని తెలియజేయటానికి ఎంతో సంతోషంగా ఉంది. మర్దానీ 3 సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండటం ఎంతో గర్వంగా ఉంది"అని అన్నారు. రైల్వే మెన్ ఫేమ్ ఆయుష్ గుప్తా మర్దానీ 3 స్క్రిప్ట్‌ను అందించారు. అభిరాజ్ మినవాలా%ొ% మర్దానీ 3 చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. బ్యాండ్ బాజా భారత్, గూండే, సుల్తాన్, జబ్ తక్ హై జాన్, టైగర్ 3 చిత్రాలకు అభిరాజ్ అసిస్టెంట్‌గా వర్క్ చేశారు. ప్రస్తుతం ఇదే బ్యానర్‌లో రూపొందుతోన్న వార్ 2 చిత్రానికి ఆయన అసోసియేట్ డైరెక్టర్‌గానూ వర్క్ చేస్తున్నారు. ఇప్పుడు మర్దానీ 3ని తెరకెక్కించబోతున్నారు.

## ఫ్యాన్స్‌కి బర్త్‌డే సర్‌ప్రైజ్



వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది వారి సక్సెస్ ఫుల్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా దీన్ని నిర్మిస్తున్నారు. నేడు (శుక్రవారం) వెంకటేష్ బర్త్ డే సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ మేకర్స్ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. వెంకటేష్ డైనమిక్, స్టైలిష్ అవతార్‌లో కనిపించిన ఈ బ్రాండ్ న్యూ పోస్టర్ అదిరిపోయిందంటూ ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు అని చిత్రయూనిట్ తెలిపింది. వెంకటేష్ బర్త్ డే సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' సెకండ్ సింగిల్ ప్రోమోని అభిమానులకు కానుకగా చిత్ర బృందం ఇవ్వనుంది. ఈ చిత్రం ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇటీవలే రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ 'గోదారి గట్టు..' సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ ట్రైయాంగిల్ క్రైమ్ కథలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. జనవరి 14న సంక్రాంతి కానుకగా ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, వీటీ గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సమర్పణ: దిల్ రాజు, నిర్మాత: శిరీష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, డీవోపీ: సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, కో రైటర్స్: ఎస్ కృష్ణ, జి. ఆదినారాయణ, యాక్షన్ డైరెక్టర్: వి.వెంకట్.

## నాకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు



తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ నటుడు అల్లు అర్జున్ కృతజ్ఞతలు తెలిపారు. తాను చట్టాన్ని గౌరవించడంతో పాటు కట్టుబడి ఉంటానన్నారు. గీతా ఆర్ట్స్ కార్యాలయం నుంచి అల్లు అర్జున్ ఇంటికి వచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అభిమానులందికీ కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబానికి మరోసారి సానుభూతి తెలుపుతున్నానన్నారు. ఆ రోజు జరిగిన ఘటన బాధాకరమన్నారు. కేసు కోర్టు పరిధిలో ఉంది కాబట్టి న్యాయస్థానాన్ని గౌరవిస్తూ ఇప్పుడు ఏం మాట్లాడడంలేదన్నారు. తాను బాగున్నానని అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అల్లు అర్జున్ ఇంటి దగ్గర పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. చంచల్‌గూడ జైలు నుంచి నటుడు అల్లు అర్జున్ శనివారం ఉదయం విడుదలయ్యారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందడంతో శుక్రవారం సాయంత్రం అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



# క్రీడలు



## జైస్వాల్ మరీ ఇంత నిర్లక్ష్యమా.. సీరియస్ అయిన రోహిత్




ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత్ మూడో టెస్టుకు సిద్ధమవుతుంది. 14న ప్రారంభం కానున్న మూడో టెస్టు కోసం టీమిండియా బ్రిస్బేన్ కు బయలుదేరింది. అయితే జైస్వాల్ ను వదిలేసి రోహిత్ సేన మాత్రమే విమానాశ్రయానికి చేరుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతేకాదు జైస్వాల్ చేసిన పనికి రోహిత్ చాలా సీరియస్ అయ్యాడట. ఇంతకీ ఏం జరిగిందంటే టీమ్ ఇండియా టీమ్ బస్సులో అడిలైడ్ హోటల్ నుండి బ్రిస్బేన్‌కు విమానాశ్రయానికి బయలుదేరినప్పుడు జైస్వాల్ సమయానికి అక్కడికి రాలేదట. చిర్రెత్తుకొచ్చిన రోహిత్ తన టీం తో కలిసి విమానాశ్రయానికి బయల్దేరారు. అయితే జైస్వాల్ రోడ్డు మార్గాన కారులో విమానాశ్రయానికి చేరుకున్నాడు. ఇది చిన్న విషయమే అయినా ఇలా తరచుగా జరుగుతుండటంతోనే రోహిత్ సీరియస్ అయినట్లు తెలుస్తుంది. ఆటగాళ్లకు సమయంపాలన ఎంతో అవసరమో రోహిత్ పలు ఇంటర్వ్యూలో చెప్పాడు. సో జైస్వాల్ అలా ఆలస్యం చేయడంతో రోహిత్ కాస్త ఘాటుగానే స్పందించాల్సి వచ్చింది. పెర్త్ టెస్టులో భారత్ విజయంలో జైస్వాల్ కీలక పాత్ర పోషించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేసి తొలి వికెట్‌కు కేఎల్ రాహుల్‌తో కలిసి 201 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కానీ అడిలైడ్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతను ఫ్లాప్ అయ్యాడు. ఇది భారత జట్టుపై ప్రభావం చూపడంతో టీమ్ ఇండియా రెండో టెస్టులో ఓడిపోవాల్సి వచ్చింది. దీంతో సిరీస్ ఒకటి ఒకటితో సమమైంది. మూడో టెస్టులో విజయం సాధించడం ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. బ్రిస్బేన్ వేదికగా జరగనున్న మూడో టెస్టు భారత్‌కు అంత సులువు కాదని అంటున్నారు. బ్రిస్బేన్‌లోని ఫాస్ట్ పిచ్‌పై కంగారూ బౌలర్లు భారత బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టె ప్రమాదం ఉంది., అయితే టీమ్ ఇండియా బ్యాట్స్‌మెనలు క్రీజులో నిలదొక్కుకుని రాణిస్తే పరుగుల వరద పారడం ఖాయం. మూడో టెస్టులో యశస్వి జైస్వాల్ మంచి ఆరంభం ఇచ్చి భారీ స్కోర్ చేయాల్సిన అవసరముంది.

## ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా తెలుగు తేజం దొమ్మరాజు గుకేశ్




భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో చరిత్ర సృష్టించాడు. చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను తుది పోరులో ఓడించి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలిచిన అత్యంత తక్కువ వయసు గల ఆటగాడిగా నిలిచాడు. 18 ఏళ్ల వయస్సులోనే ఈ ఘనత సాధించి, చెస్ ప్రపంచంలో ఓ కొత్త అధ్యాయాన్ని తన పేరిట రాశాడు. ఈ టైటిల్‌ను సాధించిన తర్వాత గుకేశ్ భావోద్వేగానికి లోనయ్యాడు. తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, ఆనందంతో కన్నీళ్లను పెట్టుకున్నాడు. టైటిల్ సాధించిన తర్వాత గుకేశ్ తన అనుభవాన్ని పంచుకున్నారు. "ఈ క్షణం కోసం నేను దశాబ్ద కాలంగా ఎదురు చూసాను," అని చెప్పారు. "పదేళ్ల తర్వాత ఆ కల నెరవేరినందుకు చాల సంతోషంగా ఉంది.ఈ విజయాన్ని ఊహించలేదని, అందుకే కాస్త భావోద్వేగానికి లోనయ్యానని ఆయన తన మనసులోని మాటలు వెల్లడించారు. "ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలవాలనే కల నాకు చిన్నప్పటినుండి ఉంది. కానీ, నాకు కంటే నా తల్లిదండ్రులకే నేను ఛాంపియన్‌గా నిలవాలని కోరిక ఉంది. నా విజయంలో వారి ప్రోత్సాహం అన్నిటికన్నా గొప్పది," అని గుకేశ్ చెప్పాడు. "డింగ్ లిరెన్ (తుది పోరులో ప్రత్యర్థి) నిజమైన ప్రపంచ ఛాంపియన్. అతని ఓటమి నాకు బాధ కలిగించింది. అయినప్పటికీ, అతనికి, అతని బృందానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు." "నేను ఈ విజయాన్ని ఊహించలేదు, కానీ అవకాశం రాగానే దానిపై ప్రయత్నించా. నా పదేళ్ల కల నెరవేరింది," అని గుకేశ్ అన్నారు."ఈ క్షణం కోసం నేను పదేళ్లుగా కలలు కనేవాడిని. ఊహించని విజయంతో ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ టైటిల్ గెలిచినంత మాత్రాన నేను ఉత్తమ ప్లేయర్ కాదు. ఉత్తమ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సనే," అని గుకేశ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## హైబ్రిడ్ మోడల్‌లోనే ఛాంపియన్స్ ట్రోఫీ.. పాక్ కూడా కీలక డిమాండ్!




ఛాంపియన్స్ ట్రోఫీ 2025 హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించనున్నారు. ఐసీసీ, పీసీబీ మధ్య డీల్ కుదిరింది. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షరతులను ఐసీసీ కూడా అంగీకరించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో టోర్నీ నిర్వహించాల్సి ఉంది. 2026లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్థాన్ జట్టు కూడా భారత్‌కు రావడం లేదు. కొలంబో వేదికగా పాకిస్థాన్ తన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు టీమిండియా పాకిస్థాన్ వెళ్లేది లేదని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. దీని తరువాత పొరుగు దేశం దీనిపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. హైబ్రిడ్ మోడల్‌లో టోర్నమెంట్ నిర్వహించడానికి నిరాకరించింది. ఛాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ మోడల్ విధానంలో నిర్వహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆమోదం తెలిపింది. పీసీబీ, బీసీసీఐల మధ్య ఒప్పందం ప్రకారం.. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు పాకిస్థాన్, దుబాయ్‌లో జరగనున్నాయి. భారత జట్టు ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగనుండగా.. మిగిలిన మ్యాచ్‌లకు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి ఐసీసీ, పీసీబీ మధ్య చర్చలు పూర్తయ్యాయి. టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించనున్నారు. ఆజ్ తక్ స్పోర్ట్స్ ఎడిటర్ విక్రాంత్ గుప్తా ట్వీట్ ప్రకారం.. టీమ్ ఇండియా తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. 2026లో జరిగే టీ-20లో పాకిస్థాన్ జట్టు పాల్గొనేందుకు పీసీబీ ఓకే చెప్పింది. అయితే 2026లో జరిగే టీ-20 ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు భారత్ రాదు. పాక్ తన మ్యాచ్‌లను శ్రీలంకలోని కొలంబో నగరంలో ఆడనుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు మొండిచేయి విడిచి ఐసీసీ నిర్ణయానికి అంగీకరించింది.

## టెస్ట్ ర్యాంకింగ్స్.. ఘోరంగా పతనమైన కోహ్లీ, రోహిత్




ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ జో రూట్ నుంచి నంబర్-1 స్థానాన్ని లాక్కున్నాడు. సో జో రూట్ 2వ స్థానానికి పరిమితమయ్యాడు. గత వారం న్యూజిలాండ్‌పై సెంచరీ చేయడం ద్వారా హ్యారీ బ్రూక్ లాభపడ్డాడు. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ లో టీమిండియా భారీగా నష్టపోయింది. కెప్టెన్ రోహిత్ శర్మ ఏకంగా ఆరు స్థానాలు దిగజారి 31వ స్థానానికి పడిపోయాడు. కనీసం టాప్ థర్టీలో కూడా లేకపోవడం ద్వారా రోహిత్ ప్రదర్శనపై మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు ఆరేళ్ల తర్వాత తొలిసారి రోహిత్ టెస్ట్ ర్యాంకింగ్స్?లో టాప్ 30 జాబితాలో చోటు కోల్పోయాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐదు స్థానాలు దిగజారి 20వ ర్యాంకులో నిలిచాడు. ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ జో రూట్ నుంచి నంబర్-1 స్థానాన్ని లాక్కున్నాడు. సో జో రూట్ 2వ స్థానానికి పరిమితమయ్యాడు. గత వారం న్యూజిలాండ్‌పై సెంచరీ చేయడం ద్వారా హ్యారీ బ్రూక్ లాభపడ్డాడు. రూట్‌కు 897 రేటింగ్ పాయింట్లు కాగా, హ్యారీ బ్రూక్ 898 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక మూడో స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ 812 రేటింగ్‌తో ఉన్నాడు. యశస్వి జైస్వాల్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ట్రావిస్ హెడ్ ఆరు స్థానాలు ఎగబాకి ఐదో స్థానానికి చేరుకున్నాడు. శ్రీలంకకు చెందిన కమిందు మెండిస్ ఒక స్థానం పైకెగసి ఆరో స్థానంలో నిలిచాడు. టెంబా బావుమా మూడు స్థానాలు ఎగబాకగా, న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ , రిషబ్ పంత్ మూడు స్థానాలు కోల్పోయారు. ఈ ర్యాంకింగ్స్ లో తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి ఆరు స్థానాలు ఎగబాకి 69వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఐసిసి టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా 890 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. అతని తర్వాత దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబడ 856 పాయింట్లతో రెండో స్థానం, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ 851 పాయింట్లతో మూడో స్థానానికి చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ల టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 415 రేటింగ్ పాయింట్లతో జడేజా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బంగ్లాదేశ్ కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ 285 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

## ఐపీఎల్ చరిత్రలో ఆరెంజ్ క్యాప్ గెలవని స్టార్ బ్యాటర్లు!




ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లి, క్రిస్ గేల్ మాత్రమే 2 సార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నారు. అయితే ఐపీఎల్‌లో స్టార్స్‌గా ఎదిగిన ముగ్గురు టీమిండియా ఆటగాళ్లు ఒక్కసారి కూడా ఆరెంజ్ క్యాప్ గెలుచుకోలేదు. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా, ఓపెనర్‌గా రోహిత్ శర్మ రికార్డులు కొల్లగొట్టాడు. ఐపీఎల్ ధనాధన్ లీగ్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వేలం ప్రక్రియ ముగిసింది. సాధారణంగానే ఈ లీగ్‌లో బ్యాట్స్‌మెన్‌ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ లీగ్లో బౌలర్లు సైతం బౌన్దరీలు బాదుతుంటారు. మరి బాటర్లు ఇంకెంత రెచ్చిపోతారో తెలిసిందే. కాగా ఐపీఎల్ లో ప్రభావం చూపించిన ఆటగాళ్లను క్యాప్ లతో సత్కరిస్తారు. ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌కు ఆరెంజ్ క్యాప్ ప్రధానం చేస్తారు. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లకు పర్పుల్ క్యాప్ లభిస్తుంది. ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లి, క్రిస్ గేల్ మాత్రమే 2 సార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నారు. అయితే ఐపీఎల్‌లో స్టార్స్‌గా ఎదిగిన ముగ్గురు టీమిండియా ఆటగాళ్లు ఒక్కసారి కూడా ఆరెంజ్ క్యాప్ గెలుచుకోలేదు. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా, ఓపెనర్‌గా రోహిత్ శర్మ రికార్డులు కొల్లగొట్టాడు. ముంబై ఇండియన్స్ ను ఐదు సార్లు ఛాంపియన్ గా నిలబెట్టాడు. కానీ రోహిత్ ఐపీఎల్ లో ఒక్కసారి కూడా ఆరెంజ్ క్యాప్ గెలవలేదు. రోహిత్ శర్మ 257 ఐపీఎల్ మ్యాచ్‌లలో 131.14 స్ట్రైక్ రేట్‌తో 6628 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు మరియు 43 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇక ఈ జాబితాలో ధోనీ కూడా ఉండటం విశేషం. ఎంఎస్ ధోని చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదు సార్లు ఛాంపియన్ గా నిలబెట్టాడు. ధోనీ అత్యుత్తమ ఫినిషర్‌గా ఎన్నో మ్యాచ్ లను గెలిపించాడు. అయితే మాహీ ఒక్కసారి కూడా ఆరెంజ్ క్యాప్ గెలవలేదు. ధోనీ 264 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 137.54 స్ట్రైక్ రేట్‌తో 5243 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతను 24 అర్ధ సెంచరీలు సాధించాడు. మిస్టర్ ఐపీఎల్ సురేష్ రైనా చాలా కాలం పాటు చెన్నై సూపర్ కింగ్స్ కు ప్రాతినిధ్యం వహించాడు. విరాట్ కోహ్లీ కంటే ముందు ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

## సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పౌష్టిక ఆహారాన్ని అందించాలి

## రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాల్లో కామన్ డైట్

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 14:**విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా తల్లిదండ్రులకు ఈ సొసైటీలపై నమ్మకాన్ని మరింత పెంపొందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు.శనివారం ఘట్కేసర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్ లో ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా శనివారం రెసిడెన్షియల్ స్కూల్లో నిర్వహించిన సంబరాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు ను విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ తో గౌరవ వందనం చేసి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో తమ పిల్లలను దశాబ్దాలుగా ఇక్కడ ఉంచి వారికి విద్య భద్రత కల్పిస్తారని భావించే తల్లిదండ్రులు ఇప్పటినుండి హైజిన్ పౌష్టికాహారం యూనిఫామ్ షూస్ సాక్సులు కాస్మెటిక్ చార్జీలు కూడా అందించడం జరుగుతుందని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు,ప్రస్తుతం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి దశాబ్దాలుగా మారకుండా ఉన్న మెస్ చార్జీలను 40 శాతానికి పెంచడంతోపాటు ఈరోజునుండి విద్యార్థులకు మెనూ చాట్ లో నిర్ణయించిన ప్రకారం పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఫ్యాకల్టీకి సూచించారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు వంట వారికి ప్రత్యేక శిక్షణను ఇప్పించడంతోపాటు హైజీన్ నిర్వహణ ఎలా చేయాలో నేర్పించడంతోపాటు ఆహారం రుచికరంగా ఎలా వండాలో కూడా నేర్పిస్తారని కలెక్టర్ అన్నారు,అంతే కాకుండా ఇక్కడ చేరే విద్యార్థులకు మంచి చదువు భద్రతతో పాటు, పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించి వారి ఆరోగ్యం పట్ల కూడా బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు గ్రహించేలా ఫ్యాకల్టీ శ్రద్ధ వహించాలన్నారు. ఇప్పటివరకు మీ పిల్లలు ఇక్కడ ఏం తింటున్నారో మీకు తెలుసు దానికంటే గొప్పగా అద్భుతంగా కొత్త మెనూలను ప్రారంభిస్తున్నామని ఆ మెనూల ప్రకారం తూచా తప్పకుండా పాటిస్తామని, అంతేకాకుండా ఈరోజు నుండి పెరిగిన కాస్మోటిక్ చార్జీలను విద్యార్థులకు అందజేస్తామని ఫ్యాకల్టీ వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన మెనూ తో ప్రత్యేక లంచ్ పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఈరోజు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని వసతి గృహాలలో ఒకే రకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈరోజు నుండి అన్ని వసతి గృహాలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది అన్నారు. ముందుగా వసతి గృహం లోని తరగతి గదులను, వంటశాలను స్టోర్ రూమ్ను పరిశీలించి సంబంధిత వివరాలను స్కూల్ ప్రిన్సిపల్ను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. విద్యార్థులు నాట్యంతో గానంతో అందరిని అలరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ ఘట్కేసర్ తహసిల్దార్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన తార్నాక నారాయణ విద్యార్థులు



**ప్రజా బలం ప్రతినిధి ఉప్పల్ డిసెంబర్ 14:**నారాయణగూడ జోన్ పరిధిలో నిర్వహించిన మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ నారాయణ గూడ జోన్ పరిధిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో తార్నాక నారాయణ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోటివేశనల్ స్పీకర్ డా.కిరణ్, కోర్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, నారాయణ పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాలపరమేశ్వర్ రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభను వెలికి తీయడం కోసం భాషాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయి అని అన్నారు. భవిష్యత్తులో వారు ఎలాంటి ఇంటర్వ్యూలలో పాల్గొన్న కూడా వారి యొక్క భాషా నైపుణ్యం వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు ఈ పోటీలలో తార్నాక నారాయణ విద్యార్థులే అధికంగా మొదటి స్థానంలో నిలవడం గర్వించదగిన విషయం అని తెలిపారు.ఈ కార్యక్రమం లో సాఫ్ట్ స్కిల్ తెలంగాణ హెడ్ వేదా, టీమ్ లీడర్ షఫీ, యోగేంద్ర, సాఫ్ట స్కిల్ బృందం, పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్, హైస్కూల్ హెడ్ మనోహర్, ఈ చాంప్స్ మహేశ్వరి, హైస్కూల్ కో- ఆర్డినేటర్ ఆజాద్, ఈ చాంప్స్ కో-ఆర్డినేటర్ లక్ష్మీభవాని, ఈ- కిడ్జ్ కో- ఆర్డినేటర్ నూర్, హైస్కూల్ ఏ డీ సురేష్, ఈ-చాంప్ సరిత ,మహేందర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

## ఐకమత్యంతో కురుమల హక్కులు సాధించుకుంటాం

-కోకాపేట సభకు బయల్దేరిన కురుమలు

-కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 14 :**కురుమల అంతా ఐక్యంగా ఉండాలని అప్పుడే మన హక్కులు సాధించుకుంటామని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు గుంట శ్రీశైలం పేర్కొన్నారు. శనివారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో హైదరాబాద్ కు వెళ్తున్న కాన్వాయ్ ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నారని తెలిపారు. కోకాపేట్ లో జరిగే సభకు సుమారు 500 మంది వరకు తరలి వెళు న్నామన్నారు. కురుమల భవన ప్రారంభోత్సవానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయలు హాజరవుతారన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏనుగుల బీరయ్య, జిల్లా నాయకులు వేనంక శ్రీనివాస్, కొంగొండ మధు, వేనంక కుమార్, కోరే రంజిత్, ఎల్కపల్లి వెంకటేష్, కట్ల చెంద్రశేఖర్, దొడ్డి శ్యామ్, మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మౌలిక వసతులు చేపట్టాలని జనసేన వినతి

**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 14 :**మందమర్రి పట్టణ ప్రాంతంలలో రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాల నిర్మాణం వెంటనే చేపట్టాలని జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు, చెన్నూరు నియోజక వర్గ నాయకులు ఆవుల సాగర్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ డి.ఈ సుమతిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆవుల సాగర్ మాట్లాడుతూ మందమర్రి పట్టణానికి పాలక వర్గం లేకపోవడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధిలో అట్టడుగు స్థానంలో ఉందన్నారు. వీరివెంట జనసేన పార్టీ నాయకులు ఆవుల శ్రావణ్ కుమార్, మేకల పవన్ కల్యాణ్, కోటపెల్లి అజయ్, రాజమొగిలి, కొంగ రవిలు ఉన్నారు.

## నాణ్యమైన భోజనం కోసమే మెస్ ఛార్జిల పెంపు

## మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ డిసెంబర్ 14 :** విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ సర్కార్ మెస్ ఛార్జిలను పెంచిందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు.శనివారం పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పపెంచిన సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు సంబరాలు చేసుకున్నారు. అనంతరం నూతన కామన్ మెను చాట్ ను ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, ప్రజావసరాలను గుర్తించి పలు పథకాలు తీసుకు వస్తుందన్నారు. హాస్టల్లలో చదువుకునే విద్యార్థులు చాలీ చాలని మెస్ చార్జీలతో పౌష్టికాహారం సరిగా అందక అనారోగ్యాల బారిన పడుతున్నారని ప్రభుత్వం మెస్ చార్జీలను నలబై శాతం పెంచిందన్నారు. విద్యార్థులకు కావల్సిన ప్రత్యేక మెనును కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. పెంచిన మెనును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధి జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, సంజీవ రెడ్డి, ప్రిన్సిపాల్ కళ్యాణి మరియు అర్జీపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి,కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మెన్ ఆరిఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగళి రమేష్,కౌన్సిలర్లు రాందేని సత్తమ్మ, సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు అంకతి శ్రీనివాస్,బోడ రాజు,అమీర్,శ్రీధర్, నవాబు ఖాన్, అధికారులు, విద్యార్థులు,వారి తల్లి తండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో కామన్ డైట్ కార్యక్రమన్ని ప్రారంభించిన జిల్లా పరిషత్ సీఈవో

## తూప్రాన్ మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీ ఎల్లయ్య



**గజ్వేల్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో గురుకులల్లో చదువుతున్న విద్యార్థుల డైట్ మరియు కాస్మటిక్ చార్జీలను 40% మేర పెంచడం జరిగింది.

తదననుగుణంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా గౌరవ ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, మరియు మంత్రులు,ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు , అలాగే వివిధ జిల్లా స్థాయి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ గురుకులాల్లో దయచేసి చార్జీల పెంపదల కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో డైట్ చార్జీల పెంపుదల కార్యక్రమంను మెదక్ జిల్లా,జిల్లా పరిషత్ సీఈవో శ్రీ ఎల్లయ్య ప్రారంభిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన రుచి, చుచి ఉన్న ఆహారాన్ని ప్రతిరోజు విద్యార్థులకు అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 40% డైట్ చార్జీలను పెంచడం జరిగింది. కావున పాఠశాల ప్రిన్సిపల్ మరియు సిబ్బంది ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలని కోరడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ చదువుతున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చేలా కష్టపడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని వారిని ఆశీర్వదించడం జరిగింది.

తూప్రాన్ మండల విద్యాధికారి శ్రీ డాక్టర్ పర్వతీ సత్యనారాయణ మాట్లాడుతూ గురుకులాల్లో చదివిన ఎంతోమంది ఈనాడు ఐఏఎస్ ఐపీఎస్ మరియు అనేక రంగాల్లో ఉన్నత స్థానంలో నిలిచారని వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు కూడా తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అలాగే విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించిన వైకాపా

విశాఖపట్నం సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి నేతలు అప హాస్యం చేస్తున్నారని, అందుకే ఎన్నికలను తమ పార్టీ బహిష్కరి స్తోందని వైసీపీ సీనియర్ నాయ కుడు, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న తమ అభ్యర్థులకు వీఆర్ఓలు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. నీటిసంఘాల ఎన్నికల్లో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నా రని బొత్స ప్రశ్నించారు. వీటన్నింటి కారణంగా ఎన్నికలను బహిష్క రిస్తున్నామన్నారు.రైతన్నలకు అండగా పేరుతో వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయ వంతమయ్యాయని ఆయన తెలిపారు. కాగా, సినీ నటులు అల్లు అర్జున్, మోహన్బాబుల విషయాల్లో ప్రభుత్వాలు తొంద రపాటు నిర్ణయాలు తీసుకోకుండా సంయమనం పాటించాలని వ్యా ఖ్యానించారు. గోదావరి పుష్కరాల సమయంలో తొక్కిసలాట జరిగి 20 మంది మృతిచెందారని, ఆ ఘటనకు ఎవరిని బాధ్యులు చేశారనేది పరిశీలించాలని కోరారు.

# మృతుల కుటుంబాలను పరామర్శ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్




**ఖమ్మం ప్రతినిది డిసెంబర్ 14 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో చిమ్మపూడి గ్రామ అధ్యక్షులు జోనబోయిన పాపయ్య కుమారుడు జోనబోయిన వెంకటేష్ ప్రేమ విఫలం చెంది ఆత్యహత్య చేసుకోవడంతో మృతిని నివాసానికి చేరుకొని వారి కుటుంబాన్ని ఓదార్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేష్ మృతి తీవ్ర దిగ్రాంతికి గురి చేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. నేటి యువత ఓటమికి కుంగిగిపోవద్దని గుండె ధైర్యంతో ముందుకు పోవాలని సూచించారు

తల్లి దండ్రులకు మీ మీదే ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తూ ఉంటారని వారి కడుపుకోతకు కారణం కాకూడదని తెలియజేశారు. వెంకటేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని వెంకటేష్ మృతి గ్రామంలో పార్టీకి తీరని లోటని తెలిపారు.అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అదేవిధంగా కోటపాడు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న భూపతిరావ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. పార్టీ తరపున అండగా ఉంటానని హామీ ఇచ్చారు

# మంత్రి వర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలి

## ......కోళ్ళ శివ మాదిగ

## ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి




**సంగారెడ్డి డిసెంబర్ 14 ప్రజ బలం ప్రతినిధి:** సదాశివపేట మండల కేంద్రంలోని గంజ్ మార్కెట్ లో జరిగిన ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోళ్ళ శివ మాదిగ మాట్లాడుతూ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మాదిగలకు అదనంగా 2 మంత్రి పదవులు ఇవ్వాలని, ఈసందర్భంగా డిమాండ్ చేశారు.

అలాగే ఆగస్టు ఒకటో తారీఖున సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి వర్గీకరణ అనుకూల తీర్పును అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆ నిర్లక్ష్యాన్ని, ఈ సందర్భంగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వర్గీకరణ చేయకపోవడం వలన మాదిగ, మాదిగ ఉపకులాలు విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ విషయం ప్రభుత్వానికి తెలిసిన కూడా నిమ్మకు నీరెత్తిన్నట్లు ఉండకుండా ఇకనైనా పద్ధతి మార్చుకోవాలన్నారు.

వర్గీకరణ వ్యతిరేకులకు కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం అండదండలు అందిస్తూ వర్గీకరణ జరగకుండా కాలయాపన చేయడానికి పూనుకోవడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. వచ్చే జనవరి 27 లోపు ఎస్సీ వర్గీకరణ మీద ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకోకపోతే వెయ్యి గొంతులు లక్ష డప్పులతో హైదరాబాదు రాష్ట్ర సచివాలయం ముందున్న అంబేద్కర్ విగ్రహం నుండి నెక్లెస్ రోడ్డు మీదుగా ట్యాంకుబండు చుట్టు మాదిగల కవార్డు నిర్వహిస్తామని, అంతలోపు వర్గీకరణ అమలు చేస్తే ఆ డప్పులు ప్రభుత్వానికి కృతజ్ఞతతో ఉంటాయని, వర్గీకరణ అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అట్లాగే వర్గీకరణ వ్యతిరేకులకు అది చావు డబ్బుగా మారుతుందని హెచ్చరిస్తున్నామన్నారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ ఈ నెల 19న మాదిగ విద్యార్థుల ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం సిద్దిపేటలో జరగనుందని, ఆ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, అధిక సంఖ్యలో మాదిగ ఉపకులాల విద్యార్థిని విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో....

మైసగల్ల బుచ్చేంద్ర మాదిగ, గందగల్ల ప్రసాద్ మాదిగ, ముక్కగల్ల కవిత మాదిగ, కుమ్మరి పల్లవి మహాజన్, మెహన్ మాదిగ,ప్రసాద్ మాదిగ, సతిష్ మాదిగ,జనార్దన్ మాదిగ,శివ కుమార్ మాదిగ, యాదగిరి మాదిగ, మరియు ఎం ఆర్ పి ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోమయాజులు రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు.

## తూప్రాన్ బాలాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు






**తూప్రాన్, డిసెంబర్, 14 ప్రజాబలం ప్రతినిధి :-** దేవి ఉపాసకులు, యజ్ఞబ్రహ్మ శ్రీశ్రీశ్రీసోమయాజులు రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీబాలాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బాల ఆంజనేయ స్వామి దేవాలయం లో సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా కనుల పండువగా జరిగాయి. దత్తాత్రేయ విగ్రహానికి అభిషేకం, మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. దైవ కీర్తనలు ఆలపించి, విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దత్త జయంతి సందర్భంగా సోమయాజుల రవీందర్ శర్మ మాట్లాడుతూ దత్తాత్రేయని జన్మదినాన్ని మార్గశిర పౌర్ణమి రోజున దత్త జయంతిగా జరుపుకుంటారు అని తెలిపారు.

ఇది పవిత్రమైన రోజుగా పరిగణించబడుతోందన్నారు. అత్రి మహాముని, మహా పతివ్రత అనసూయల సంతానమే దత్తాత్రేయుడు అని అన్నారు. ఈయన త్రిమూర్తులు అంటే బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల అంశలతో జన్మించిన అవతారమూర్తి. అందునా దత్తాత్రేయుడు విష్ణువు అంశతో, చంద్రుడు బ్రహ్మ అంశతో, దుర్వాసుడు శివుని అంశతో జన్మించారని పురాణ కథనం ప్రకారం వివరించారు. దత్త జయంతి రోజున తెల్లవారు జామునే భక్తులు నదీస్నానం లేదా ఏటి స్నానం చేసి ధర్శించుకుంటారని తెలిపారు. దత్తత్రేయునికి షోడశోపచారాలతో పూజ చేస్తారన్నారు. జప ధ్యానాలకు ఈ రోజు ప్రాముఖ్యం ఇస్తారన్నారు. దత్తాత్రేయుని యోగమార్గం అవలంబిస్తామని సంకల్పించుకుంటారన్నారు. దత్త చరిత్ర, గుర చరిత్ర, అవధూత గీత, జీవన్ముక్త గీత, శ్రీపాదవల్లభ చరిత్ర, నృసింహసరస్వతి చరిత్ర, షిర్డి సాయిబాబా చరిత్రం, శ్రీదత్తదర్శనం వంటివి పారాయణ చేస్తారన్నారు. ఈ రోజు ఉపవాసం ఉండడం కూడా ఆనవాయితీనే అని వివరించారు. శ్రీపాద వల్లభ అవతారానికి సంబంధించిన ప్రదేశాలు ఉన్నాయి అని తెలిపారు. అవధూత దత్త పీఠం వారి ఆధ్వర్యంలో కూడా కొన్ని దత్తాత్రేయ ఆలయాలు ఉన్నాయన్నారు. దత్తాత్రేయ జయంతి నాడు దత్తాత్రేయ స్వామి ని పూజించడం వల్ల మానవ మనుగడకు కావలసిన గురు బలము, గురుశక్తి ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యం కలుగుతాయని భక్తితో దేవుని పూజించినచో సుఖసంతోషాలతో ఉంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు సాయి శర్మ, రామకృష్ణ శర్మ, కృష్ణ, భక్తులు గడ్డం సుధాకర్, పత్కల్ సేటు, చేగురి శ్రీనివాస్, అశోక్ గుప్తా ,హరి శంకర్ గౌడ్ , సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్,గడ్డం ప్రశాంత్ కుమార్ తోపాటు భక్తులు పాల్గొన్నారు.

# నేడు మాజీ మంత్రి హరీష్ రావు రాక ఘనంగా స్వాగతం పలుకుదాం బండ నాగరాజు యాదవ్.




**డిసెంబర్ 14 తూప్రాన్ ప్రజాబలం ప్రతినిధి :-** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప పడిపూజ కార్యక్రమానికి విచ్చేయునునా మాజీ మంత్రి హరీష్ రావు గారికి భారీ ఎత్తున స్వాగతం పలుకుదామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు బండ నాగరాజు యాదవ్ ,యాదవ సోదరులకు పిలుపునిచ్చారు మునిసిపల్ అధ్యక్షులు సతీష్ చారి ఆదేశాల మేరకు తూప్రాన్ లోని వివిధ కుల సంఘాల నాయకులు యువకులు పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున స్వాగతం పలకాలని తెలిపారు.

# లక్షెట్టిపేట ప్రభుత్వం హాస్పిటల్ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే,కలెక్టర్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ డిసెంబర్ 14 :** మంచిర్యాల నియోజకవర్గం లక్షెట్టిపేట మున్సిపాలిటీలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ హాస్పిటల్ భవనాన్ని పరిశీలించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,సంబంధిత అధికారులు ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బలమైన ఆహారం తింటేనే పిల్లల శారీరక, మానసిక ఎదుగు తారు కామన్ డైట్ కార్యక్రమలో పోలీస్ కమిషనర్

## బలమైన ఆహారం తింటేనే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుంది పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం ప్రతినిధి డిసెంబర్ 14 (ప్రజాబలం)** తెలంగాణ ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం అర్బన్ మండలం గొల్లగూడెం రోడ్ లోని తెలంగాణ మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ మరియు కళాశాల రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, కూరగాయలు, సరుకులను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలు, విద్యాబోధన గురించి పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారుఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా వుండాలని, అనవసరమైన ఫోన్ కాల్స్, మెసేజ్ లింకులు ఓపెన్ చేయడం ద్వారా బ్యాంక్ ఎకౌంట్ వివరాలు సైబర్ నేరుగాళ్ళకి చిక్కుతుందని తద్వారా అకౌంట్ లోని డబ్బులు పోతాయని అన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, పోలీసులు నిరంతరం మీ సేవలో ఉంటారని ఎవరికైనా ఆపద కలిగితే వెంటనే డయల్ 100, సైబర్ నేరాలకు1930 కు ఫోన్ చేయాలని తెలిపారుమాదకద్రవాల వాడకం వలన జరిగి నష్టాలను గురించి ఈ సందర్భంగా వివరించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ మహిళా స్కూల్, కాలేజీ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ సీతామాలక్ష్మి అర్బన్ సీఐ భాను ప్రకాష్, ఆర్ ఐ వహీద్ పాల్గొన్నారు



# పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా కామన్ డైట్ కార్యక్రమం అమలు

## తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రిపొంగులేటి శ్రీనివాస రెడ్డి

**పేదోడి పిల్లలు, ధనవంతుల పిల్లల్లా చదవాలి**

**40 శాతం డైట్ చార్జీలు, 250 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచిన ఇందిరమ్మ ప్రభుత్వం**

**5 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల నిర్మాణం**

**తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి పొంగులేటి**







పాలేరు ప్రతినిధి డిసెంబర్ 14 (ప్రజాబలం) పాలేరు నియోజకవర్గం పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం లోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో శనివారం జరిగిన కామన్ డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి విద్యార్థులు, అధికారులు బ్యాండ్ వాయిస్తూ, పూలతో ఘనంగా స్వాగతం పలికారు ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా రూపొందించిన కొత్త డైట్ మెనూను మంత్రి ప్రారంభించారు. కామన్ డైట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదోని పిల్లలు కూడా ధనికుల పిల్లల్లా చదవాలని, పేదోని పిల్లల కోరికలు తీరేలా ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచిందన్నారు. ప్రభుత్వానికి అదనంగా సుమారు 500 కోట్ల భారం పడుతున్నప్పటికి దీనిని భారంగా కాక, బాధ్యతగా చేశామని తెలిపారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలే కాక ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్నామన్నారు గడిచిన పది సంవత్సరాల్లో గత ప్రభుత్వం పేదవారి పిల్లలను పట్టించుకోలేదని ఇందిరమ్మ రాజ్యంలో హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీలు నలభై శాతం కాస్మోటిక్ చార్జీలు 250 శాతానికి పెంచామని అన్నారు డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచిందని, అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచినట్లు మంత్రి తెలిపారు ప్రతి నియోజకవర్గం లో 150 కోట్ల రూపాయల తో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం చేస్తున్నట్లు, అన్ని సదుపాయాలు ఇంటర్నేషనల్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు 52 నుంచి 54 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు ఈ సంవత్సరం బడ్జెట్ లోనే నిధులు కేటాయించుకున్నామని, త్వరలోనే నిర్మాణాలు చేపడతామని అన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్ని చేసాం, ఇంకా కొన్ని చేయాల్సి ఉందని, గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల ఇబ్బందులు కలిగాయని, అన్ని చక్కదిద్దుకొని, ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తామన్నారు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళల ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో విద్య, వైద్యం కి పెద్దపీట వేశామని మంత్రి తెలిపారు. ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్నామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదవారికి 10 లక్షల ఉచిత వైద్యం కల్పిస్తున్నట్లు తెలిపారు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న గత ప్రభుత్వం వదిలేసిన ప్రాజెక్టు లను పూర్తి చేస్తున్నామని అన్నారు ఖర్చు పెట్టె ప్రతి రూపాయి పేదవారికి చెందే విధంగా అధికారులు సహకరించాలని, పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీలు సద్వినియోగం చేయాలని మంత్రి అన్నారువిద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, స్వంత పిల్లలా చూసుకోవాలని మంత్రి తెలిపారు

ఈ సందర్భంగా మంత్రి పిల్లలతో కలిసి భోజనం చేశారు.

అంతకుముందు మంత్రి, పాఠశాలలో సిద్ధం చేసిన వంటలను పరిశీలించారు. స్టోర్ రూమ్ పరిశీలించారు. సామాగ్రి ఎన్ని రోజులకు వస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రుడ్లను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవన పనులను పరిశీలించారు. రూ. 5 కోట్లతో జి ప్లస్ 3 గా నిర్మిస్తున్న పాఠశాల కాంప్లెక్, ప్రిన్సిపాల్, స్టాఫ్ క్వార్టర్స్, సెక్యూరిటీ రూమ్ ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యతలో రాజీ లేకుండా, అగ్రిమెంట్ సమయంలోగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పాఠశాల కాంపౌండ్ నిర్మాణం పూర్తి చేయాలని, సుందరీకరణ, జనరేటర్, ఆర్వో ప్లాంట్ ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, సిఇ శంకర్, డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, ఇఇ తానాజీ, తహసీల్దార్ రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# పల్లె దవాఖానలో వర్చువల్ సమావేశం





ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, డిసెంబర్ 14:నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి అవార్డు కోసం సెంట్రల్ టీం శనివారం వర్చువల్ సమావేశాన్ని పట్టణంలోని దీపక్ నగర్ లో గల పల్లె దవఖానలో నిర్వహించారు. పల్లె దవఖానాలో గల సౌకర్యాలను, ప్రజలకు అందిస్తున్న సేవలను వర్చువల్ గా అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎన్.క్యూ . ఏ.ఎస్ క్వాలిటి మేనేజర్ సాగర్ మాట్లాడుతూ జాతీయస్థాయి నిబంధనలు మేరకు 70% దాటితే జాతీయ స్థాయిలో సర్టిఫికెట్ లభిస్తుందని వారు తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైన దవఖానకి మూడు సంవత్సరాల పాటు అదనంగా నిధులు మంజూరు అవుతాయని దీని ద్వారా మరిన్ని సేవలు ప్రజలకు అందించే అవకాశాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలోనే మొట్ట మొదటిగా వర్చువల్ సమావేశమును దీపక్ నగర్ సెంటర్ లో ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. ఈసమావేశంలో డి.ఏం.అండ్ హెచ్. ఓ డాక్టర్ హరీష్ రాజ్ పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. భవాని, పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, డాక్టర్ మానస, డాక్టర్ ప్రతాప్, ఏ.ఏ.ఏం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్, డి.పి.ఓ ప్రశాంతి, ఏ.ఎన్.ఏం లు పద్మావతి, జ్యోతి, ఆశ కార్యకర్తలు సమిండ్ల లక్ష్మి, సుజాత, సుశీల, లంక స్వరూప, ఈ. స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సెన్సార్ బోర్డు కమిటీ సభ్యురాలిగా కళ్ళెపు భవాని



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 14 :తెలంగాణ రాష్ట్రంలో నూతన సెన్సార్ బోర్డు ఏర్పాటు అయిన నేపథ్యంలో బోర్డు కమిటీ మెంబెర్ గా సామాజిక సేవా సంస్థ గౌరవ అధ్యక్షురాలు కళ్లెపు భవాని సభ్యురాలిగా నియమితులయ్యారు. గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో మహిళలు, బాలల హక్కుల పై చైతన్య పరుస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు సామజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ రంగంలో భవాని ముందున్నారు. ఈ సందర్భంగా కళ్లెపు భవాని శనివారం మీడియాతో మాట్లాడుతూ తన నియామకం పట్ల మినిస్టరి ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ క్యాస్టింగ్ తోపాటుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సినిమాటోగ్రఫీ చట్టాలను పాటిస్తూ విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు పదవి కాలపరిమితి రెండేళ్ల పాటు కొనసాగుతోందని ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రతి ఎగ్జామింగ్ కమిటీలో ఉన్నత స్థాయి అధికారి తోపాటు నలుగురు సభ్యులు ఉండగా వారిలో ఇద్దరు మహిళలు తప్పనిసరి అయితే సామాజిక సేవికురాలు కళ్లెపు భవాని బోర్డు మెంబెర్ కావడం పట్ల తెలుగు రాష్ట్రాల మహిళలు, చిన్నారులు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆనందం వ్యక్తం చేశారు.

# హనుమకొండ నందు ముకుంద జ్యువెలర్స్ నూతన బ్రాంచ్ గొప్ప ప్రారంభం



హనుమకొండప్రజాబలం ప్రతినిధి :-హనుమకొండ నందు మొట్టమొదటి జ్యువలరీ ఫ్యాక్టరీ ఔట్లెట్ నూతన బ్రాంచ్ ముకుంద జ్యువెలర్స్ ప్రారంభించారు 14 డిసెంబర్ శనివారం ఉదయం 11. 15 గంటలకు, హనుమకొండ , #6-2-203, VPC1, MAIN ROAD, HANAMAKONDA CHOWRASTA, Hanamkonda, నందు శ్రీ Naini Rajender Reddy Mla (West Warangal) మరియు వేముల శ్రీనివాస్ గారు కార్పొరేటర్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ KPHB, కొత్తపేట, సోమాజిగూడ, మరియు ఖమ్మం నందు తమ బ్రాంచిలను ప్రారంభించామని మేము ఊహించిన దానికంటే ఎక్కువ సక్సెస్ కావడంతో నేడు హనుమకొండ లో తమ ఇంకో నూతన బ్రాంచ్ ను ప్రారంభించడం జరిగిందని సంస్థ MDనరసింహ రెడ్డి గారు తెలిపారు మరియు మమ్మల్ని ప్రోత్సహిస్తున్న కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మరెన్నో బ్రాంచ్లను ప్రారంభిస్తామని తెలిపారు. %PH: 040-28999999.

## చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 14:నిజామాబాద్ జగ్దల్ పూర్ నేషనల్ హైవే-63 జోడు వాగుల రోడ్డు మరమ్మతులు చేసినందుకు గాను కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశి క్రిష్ణ లకు చెన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకుల పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత పది యేండ్ల బి ఆర్ ఎస్ పాలనలో రోడ్డు కనీసం మరమ్మతులకు నోచుకోలేదని కాంగ్రెస్ నాయకులు మంది పడ్డారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశి క్రిష్ణ చొరవతో కోటి ఎనభై నాలుగు లక్షల నిధులతో జోడు వాగులు రోడ్డు మరమ్మతులు చేయడం సంతోషంగా ఉందన్నారు. మరి కొన్ని రోజుల్లో అటవీ శాఖ పర్మిషన్లు, టెండర్లు పూర్తి కాగానే ఫోర్ వే లైన్ కూడా నిర్మించడం జరుగుతుందని దీంతో చెన్నూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com